ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శనివారం 28 డిసెంబరు 2024

3న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్


నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : ఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు వచ్చే నెల 3వతేదీన నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకుముందు జిల్లావ్యాప్తంగా పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సదరన్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌ను శనివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత, సమూహ, ఉపాధ్యాయ విభాగాల్లో జరిగే ఈ పోటీల నుంచి ఒక్కో ప్రాజెక్ట్‌ను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 30న మండలస్థాయి పోటీలు నిర్వహించి ప్రతి మండలం నుంచి ఉత్తమ ప్రాజెక్ట్‌ను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు.

2024 వెలుగు నీడలు









ఆత్మకూరు : నారంపేట వద్ద ఇండస్ట్రియల్ పార్కులో నిర్మాణంలో ఉన్న రహదారి

ఆత్మకూరు : మెట్ట ప్రాంతమైన ఆత్మకూరులో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసినా పారిశ్రామిక ప్రగతికి మాత్రం గ్రహణం వీడలేదు. 2020 లో

'ఆత్మ' ఘోషిస్తోంది!

ఆర్భాటంగా ఆత్మకూరు మండలం నారంపేట సమీపంలో 173 ఎకరాల్లో నూతనంగా ఇండస్ట్రీయల్ పార్కుకు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దీంతో ఆత్మకూరు పారిశ్రామికంగా అడుగులు వేస్తుందని ప్రజలు ఎంతగానో ఆశపడ్డారు. ఆ క్రమంలో ఈ పార్కులో సెంచరీ ఫ్లైవుడ్ పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. కానీ ఏం జరిగిందో ఏమో ఈ పరిశ్రమ జగన్ సొంత జిల్లా కడపలోని బద్వేల్ నియోజకవర్గానికి తరలిపోయింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఇండస్ట్రీయల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటు ఊసే లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం పారిశ్రామికవాడలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కొలిక్కి వచ్చింది. 67 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, నీటి వసతి కోసం రూ.13 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ క్రమంలో కేంద్రం రూ.10.5 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.12.93 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. రూ.8 కోట్లతో మిగిలిన రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నారు. మరో మూడు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయి. విద్యుత్, నీటి వసతి కల్పించాల్సి ఉంది.

ఆశలు రేపుతోంది!

రామాయపట్నం పోర్టు అనుసంధానంగా బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దాదాపు రూ.95వేల కోట్ల పెట్టుబడితో ఇంత భారీ పరిశ్రమ రానుండగా, దీని అనుసంధానంగా సుమారు 15 పరిశ్రమలు పోర్టు సమీపంలో ఏర్పాటు కానున్నాయి. దీంతో దాదాపు 5వేల మందికి ప్రత్యక్షంగా, మరో లక్ష మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే పోర్టు సమీపంలో బీపీసీఎల్ కోసం ఏపీఐఐసీ భూసేకరణ చేపట్టింది. ఈ ప్రాజెక్ట్ ముందస్తు కార్యకలాపాల కోసం రూ.6100 కోట్లు విడుదల చేసింది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కానున్నాయి. అలాగే పోర్టు సమీపంలో పెట్రో కెమికల్ ప్లాంట్, ల్యూబ్రికెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్, ఫ్యూయల్ అడిటివ్స్, వ్యాక్స్ ప్రొడక్షన్, ఆఫాల్ట్ ప్రొడక్షన్ ప్లాంట్, సల్ఫర్ రికవరీ ప్లాంట్, కెటలిస్ట్ మానుఫ్యా క్చరింగ్ రిఫైనరీ మెయిం టెనెన్స్ సర్వీస్ ప్లాంట్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ ప్లాంట్, ఎన్విరాన్‌మెంట్ ప్లాంట్, ట్యాంక్ మ్యానుఫ్యాక్చరింగ్, పైప్స్ మ్యాన్‌ఫ్యాక్చ రింగ్, వాల్వ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇన్సులేషన్ అండ్ రిఫ్రాక్టరీ సర్వీస్, లాజిస్టిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లాంట్ ఇలా దాదాపు 15 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

నాడు తిరోగమనం.. నేడు ప్రగతిపథం

సార్వత్రిక ఎన్నికలతో జిల్లా ప్రస్థానాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ ఏడాది.. పారిశ్రామిక రంగానికి మరకలతో పాటు మెరుపులనూ అందించింది. గత పాలకుల అనాలోచిత నిర్ణయాలతో కొత్త పరిశ్రమల ఏర్పాటు అటుంచితే ఉన్న పరిశ్రమలు కూడా మూతపడే స్థాయికి చేరిపోయాయి. ఇక ఉపాధి కోసం యువతతో పాటు గ్రామీణ ప్రజానీకం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా ఏడాదిలో మొదటి సగం.. పారిశ్రామిక రంగం అథోగతిని చవిచూసిన జిల్లా.. తదుపరి ఆరునెలలు మాత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జిల్లాపై శ్రద్ధ చూపడంతో గణనీయమైన పురోగతి వైపు పరుగులు పెడుతోంది. పోర్టుల ఆధారంగా ఎన్నో పరిశ్రమలు రానుండగా, ఇండస్ట్రీయల్ కారిడార్‌లూ ఏర్పడనున్నాయి.

\- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)



ఆత్మకూరు : నారంపేట వద్ద ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన స్థలం


రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ఊపందుకుంది. ఆశావహులు కూడా పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈల అభివృద్ధిపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా అధికారులు ఎంఎస్ఎంఈల వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా ఎంఎస్ఎంఈలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించనున్నారు. అదేవిధంగా జిల్లాలోని కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల ఆధారంగా అనేక అంతర్జాతీయ పరిశ్రమలు జిల్లావైపు చూస్తున్నాయి. సముద్ర తీర ప్రాంతం ఎక్కువగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం సీబీఐసీ (చెన్నై- బెంగళూరు ఇండస్ట్రీయల్ కారిడార్), వీసీఐసీ (విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్) ఏర్పాటు చేస్తోంది. ఈ రెండు కారిడార్‌లు జిల్లాకు అనుసంధానంగా వెళుతుండటంతో అనేక అంతర్జాతీయ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం ఏర్పడింది.

● పోర్టులతో వేగంగా అభివృద్ధి

కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల అనుసంధానంగా అనేక అంతర్జాతీయ పరిశ్రమలు రానున్నాయి. కృష్ణపట్నం పోర్టు ఆనుకొని 2500 ఎకరాల్లో క్రిస్‌సిటీ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. సీబీఐసీలో భాగంగా మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం రూ.2139.44 కోట్లతో దీన్ని ఏర్పాటు చేస్తోంది. అదేవిధంగా రామాయపట్నం పోర్టు ఆనుకొని మెగా ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన 2500 ఎకరాల భూసేకరణ పూర్తి కావస్తోంది. దీంతో నెల్లూరు జిల్లాలో ఇప్పటికే రెండు పోర్టుల అనుసంధానంగా అనేక అంతర్జాతీయ పరిశ్రమలైన ఇండోసోల్ సోలార్, జాన్సన్ ఇన్‌ఫ్రా, జేఎస్‌డబ్ల్యూ, ఉత్కర్ష లిమెటెడ్, క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ, శ్రీచక్ర లిమిటెడ్, విశ్వసముద్ర లిమిటెడ్ వంటి ప్రతిష్టాత్మక పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు పనులు ప్రారంభించాయి కూడా.

అనాలోచిత నిర్ణయాలతో..

వైసీపీ హయాంలో రాష్ట్రంతోపాటు నెల్లూరు జిల్లాలో అనేక పరిశ్రమలు మూత పడ్డాయి. అప్పటి పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. ఏపీఐఐసీ ద్వారా భూములను విక్రయించే సేల్ డీడ్ విధానాన్ని రద్దు చేసింది. కేవలం భూములు లీజు తీసుకొనే విధానాన్ని ప్రవేశపెట్టడంతో నూతన పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం మానేశారు. దీంతో ఔత్సాహికుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహ నెలకొంది. వైసీపీ నాయకులు పలు పరిశ్రమల యజమాన్యాలను అనేక విధాలుగా వేధింపులకు గురి చేయడంతో పరిశ్రమల ఏర్పాటు అటుంచితే ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయి.



● ఒక్క ప్లాటూ అమ్ముడుపోలేదు!

జిల్లాలో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఉన్న ప్లాట్లలో ఒక్కటి కూడా గడిచిన ఐదేళ్లలో అమ్ముడుపోలేదు. దీనికితోడు వైసీపీ ప్రభుత్వం అనేక పర్యాయా లు విద్యుత్ చార్జీలు పెంచడంతో ఆ భారం భరించలేక అనేక చిన్న చితకా పరిశ్ర మలు మూత పడ్డాయి. ఇక పరిశ్రమల్లో ఉద్యోగాల నియామక ప్రక్రియల్లో రాజకీ య జోక్యం ఎక్కువైంది. భూ సమస్యలు పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

జిల్లా పారిశ్రామిక రంగంలో మరకలు, మెరుపులు



'రాళ్లపాడు' నిండిందోచ్!

● ఏ క్షణమైనా గేట్లు ఎత్తి నీరు విడుదల చేసే అవకాశం

లింగసముద్రం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు రిజర్వాయర్ మూడేళ్ల తర్వాత పూర్తి సామర్థ్యానికి మించి నిండింది. గడిచిన నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఈ వర్షాలకు ముందు 19.11 అడుగులు ఉన్న నీటిమట్టం ప్రస్తుతం 20.6 అడుగులకు చేరింది. వాస్తవానికి డ్యాం సామర్థ్యం 20 అడుగులు. అయితే ప్రాజెక్టులో 21.6 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అంతకుమించితే ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలోని రేడియల్ గేట్లపై నుంచి నీరు పొర్లిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో వెయ్యి క్యూసెక్కుల మేర ఉందని ప్రాజెక్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

● ప్రజల అప్రమత్తం

ఒకవేళ ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం పెరిగితే గేట్లను ఎత్తి దిగువ మన్నేరుకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. దీంతో మన్నేరు పరివాహక ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

● 'సోమశిల'కు 4,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 4,100 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.784 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువ 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● 'కండలేరు'లో 57 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంలో 57 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 1,310 క్యూసెక్కులు, వివిధ కాలువల ద్వారా అవుట్ ఫ్లో 715 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు తెలిపారు.

నీరసం.. నిరుత్సాహం!

● వైసీపీ ఆందోళనలో కనిపించని ఉత్సాహం.
● పలుచోట్ల మొక్కుబడిగా ఆందోళనలు
● పార్టీ హడావిడి తప్ప ప్రజల్లో కనిపించని స్పందన



కావలిలో అతికొద్ది మందితో ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

నెల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు జగన్ ముడుపులే కారణమని రాష్ట్రం మొత్తం ఘోషిస్తుంటే దానికి కూటమి ప్రభుత్వాన్ని దోషిగా చూపుతూ శుక్రవారం వైసీపీ చేపట్టిన ఆందోళనకు ప్రజా మద్దతు నామమాత్రంగానే కనిపించింది. వైసీపీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు తప్ప సామాన్య ప్రజలెవరూ ఈ ఆందోళనలో పాదం కలపలేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర పార్టీ కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించిన నాయకులు ప్రతిపక్ష హోదాలో చేపట్టిన తొలి కార్యక్రమంలోనే నీరసంగా కనిపించారు. జిల్లాలో ప్రముఖ రాజకీయ కుటుంబాల్లో ఒకటైన మేకపాటి కుటుంబానికి చెందిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉదయగిరిలో ఆందోళనకు పిలుపునిచ్చారు. కానీ ఆందోళన మాత్రం పేలవంగానే జరిగిందని చెప్పాలి. మహా అయితే వంద మందికి అటు ఇటుగా జనం పాల్గొన్నారు. అది కూడా వైసీపీ కార్యకర్తలు, మేకపాటి అనుచరులే. వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా మొహం చాటేశారు.

● కావలిలో ఏకంగా ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గైర్హాజరు అయ్యారు. స్థానిక పార్టీ నాయకులే ఈ ఆందోళనను మమ అనిపించారు. ఇక్కడా మహా అయితే వంద మందికి అటు ఇటుగా కార్యకర్తలు హాజరయ్యారు.

● సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం, కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాలెంలో చేపట్టిన ఆందోళనకు పార్టీ క్యాడర్ ఓ మోస్తారుగా హాజరయ్యింది. ఆందోళనల చేయకతప్పదు అనే మొక్కుబడి తనం నాయకుల్లో కనిపించిడం ఒక విశేషమైతే, ఎక్కడా ప్రజల భాగస్వామ్యం కనిపించకపోవడం మరో విశేషం.

కందుకూరులో వర్గ విభేదాలు

కందుకూరు : వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన మొదటి ఆందోళన కార్యక్రమానికి ఆ పార్టీకి చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్యనేతలంతా డుమ్మా కొట్టారు. బుర్రానే స్వయంగా ప్రజాప్రతినిధులకు, ముఖ్యనేతలందరికీ ఫోన్లు చేసి జనసమీకరణ చేసుకుని రావాలని కోరినా అంతా డుమ్మా కొట్టడం విశేషం. నియోజకవర్గంలో 5 మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు వైసీపీ వారే కాగా ఒక్క గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్ మినహా మిగిలిన వారెవరూ ఈ నిరసనలో పాల్గొనలేదు. అలాగే నియోజకవర్గంలో 90 శాతానికిపైగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైసీపీ వారే కాగా వారు కూడా ఒకరిద్దరు మినహా ఎవరూ రాలేదు. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా ఇన్చార్జి బుర్రా కార్యక్రమాలు చేస్తుండటమే ఈ పరిణామాలకు కారణంది. ఇటీవల వైసీపీ అధినేత జగన్ ఆధ్వర్యంలో తాడేపల్లిలో పూర్వప్రకాశం జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మహీధరరెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావులకు ఆహ్వానం అందలేదు. దీంతో వారిద్దరూ సమావే శానికి వెళ్లకపోగా మిగిలిన ప్రజాప్రతినిధులంతా హాజరయ్యారు. ప్రస్తుతం డుమ్మా కొట్టిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఇతర ముఖ్యనేతలు జగన్‌తో జరిగిన సమావేశానికి వెళ్లి వచ్చారు.

డెల్టా ఆధునికీకరణకు రూ.100 కోట్లు

● కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లకు మహర్దశ
● డ్రెయిన్ల రూపురేఖలు మారే అవకాశం

నెల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెన్నార్ డెల్టా ఆధునికీకరణకు రూ.100 కోట్లు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిధులను నాబార్డు నుంచి రుణంగా తీసుకోనున్నారు. కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లతోపాటు డెల్టాలోని కాలువల రూపురేఖలు మారనున్నాయి. రాష్ట్రంలోని సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం నాబార్డు నుంచి రూ.1000 కోట్ల రుణాన్ని సమీకరించింది. అందులో గోదావరి డెల్టాకు రూ.450 కోట్లు కేటాయించగా, కృష్ణా డెల్టాకు రూ.250 కోట్లు కేటాయించింది. పెన్నా డెల్టాకు రూ.100 కోట్లు, ఎత్తిపోతల పథకాలకు రూ.100 కోట్లు, చిన్న నీటి వనరుల అభివృద్ధికి మరో రూ.100 కోట్లను కేటాయించేలా నిర్ణయం తీసుకుంది. ఈ కేటాయింపుల ప్రకారం డెల్టాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం నుంచి జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో కనిగిరి రిజర్వాయర్, సర్వేపల్లి రిజర్వాయర్‌లతోపాటు డ్రెయిన్లను అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కనిగిరి రిజర్వాయర్ కట్టను పటిష్టపరచనున్నారు. అలానే రివిట్‌మెంట్ కూడా చేయనున్నారు. రిజర్వాయర్ నుంచి వెళ్లే కాలువలను ఆధునికీకరించనున్నారు. ఇందుకుగానూ రూ.27.69 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అలానే సర్వేపల్లి రిజర్వాయర్ కరకట్టలను కూడా పటిష్టపరచడంతోపాటు రివైట్‌మెంట్ చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇక్కడా తూములు, కాలువలను ఆధునికీకరించనున్నారు. ఇందుకోసం రూ.35.41 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇక ఫైడేరు మేజర్ డ్రెయిన్, అల్లూరు స్వాంప్ మేజర్ డ్రెయిన్లను ఆధునికీకరించేందుకు రూ.36.88 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా, అన్నిటినీ జిల్లా నుంచి చీఫ్ ఇంజనీర్‌కు పంపారు. అక్కడ నుంచి ఈఎన్‌సీకు చేరుతాయి. అక్కడ ప్రతిపాదనలను ఫైనల్ చేసి ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లభించగానే ఉత్తర్వులు వెలువడుతాయి. తదుపరి టెండర్లు పిలిచి పనులు మొదలుపెడతారు.

ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు ముందడుగు

నగరంలో స్థలాన్ని పరిశీలించిన అధికారుల బృందం 6

ఎస్ఐ శివకృష్ణారెడ్డి సస్పెన్షన్

నెల్లూరు (క్రైం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ముత్తుకూరు, కృష్ణాపట్నం పోర్టు పోలీసుస్టేషన్లలో ఎస్ఐగా పనిచేసిన శివకృష్ణారెడ్డిని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సస్పెండ్ చేశారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి శివరామకృష్ణారెడ్డి వీరభక్తుడిగా పేరు తెచ్చుకున్నారు. వైసీపీ నాయకులు చెప్పిన మాటలను శిరసావహిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేశారు. ఈ వ్యవహారాలపై ఆధారాలతో సహా హోం మంత్రి, డీజీపీ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, ఎస్పీలకు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారించిన పోలీసు శాఖ శివకృష్ణారెడ్డిని సస్పెండ్ చేసింది. ఎనిమిది నెలల క్రితమే శివకృష్ణారెడ్డి జిల్లా నుంచి గుంటూరుకు బదిలీ అయ్యారు.


ఆదాయం ఎక్కడ!?

ఆర్థిక వనరులపై 'నుడా' దృష్టి ● ఎంఐజీ లేఅవుట్ల ఏర్పాటుకు కసరత్తు ● భూసేకరణ బాధ్యతలు జేసీకి

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా)ను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వంలో కేవలం లేఅవుట్లు అపార్ట్‌మెంట్ల ఫీజులతోనే కాలం గడుపుతూ ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతూ వచ్చింది. ఈ కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నుడా ఛైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నియమించడం, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆర్థిక వనరులను సమకూర్చేందుకు సూచనలు చేయడంతో అందుకు అనుగుణంగా అడుగులు పడుతున్నాయి. నుడాకు ప్రధాన ఆదాయ వనరు

\- మిగతా 6లో..

ఎంఐజీ లేఅవుట్లపై దృష్టి పెట్టాం



ఆర్థిక కష్టాల్లో ఉన్న నుడాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంఐజీ లేఅవుట్లే కీలకం. ఇందుకోసం 8 నియోజకవర్గాలలో ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నాము. వీటితో పాటు ప్రైవేటు స్థలాలనూ అభివృద్ధి చేసి అమ్మేందుకు రియల్‌ఎస్టేటర్లను ఆహ్వానిస్తున్నాం.

\- కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నుడా చైర్మన్



స్వామియే..
శరణం అయ్యప్ప!

నెల్లూరు నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో జరుగుతున్న మండల పూజల్లో భాగంగా శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామికి నగరోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారు ఉదయం అయ్యప్పగుడి నుంచి మంగళ వాయిద్యాలతో నవాబుపేట శివాలయంకు చేరుకుని విడిది చేశారు. సాయంత్రం అక్కడ సర్వాలంకార భూషితుడై నగరోత్సవంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. విద్యుద్దీపాలంకరణలు, కేరళ వాయిద్యాలు, కావడిలు అయ్యప్ప నామస్మరణల నడుమ సాగింది. నగరోత్సవం నవాబుపేట, పప్పులవీధి, స్టోన్‌హౌస్‌పేట, ఏసీ బొమ్మ, ట్రంకురోడ్డు, గాంధీ బొమ్మ, వీఆర్‌సీ, ఆర్టీసీ, కేవీఆర్ సెంటర్, బొల్లినేని ఆసుపత్రి, దర్గామిట్ట, వేదాయపాలెం, అయ్యప్పగుడికి చేరుకుంది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు జి.శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

నెల్లూరులో అఖిల భారత క్యారమ్ పోటీలు

- దేశవ్యాప్తంగా 400 మంది క్రీడాకారుల హాజరు
- జనవరి 5 నుంచి 8వతేదీ వరకు నిర్వహణ



వివరాలు వెల్లడిస్తున్న క్యారమ్ సంఘం ప్రతినిధులు శ్రీమన్నారాయణ, రఘురామ్ శ్రీధర్ తదితరులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో తొలిసారిగా అఖిల భారత ఫెడరేషన్ కప్ క్యారమ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలకల శ్రీమన్నారా యణ తెలిపారు. నగరంలోని నెల్లూరు క్లబ్ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారత పోటీల నిర్వహణకు క్యామర్ ఫెడరేషన్ తమకు అనుమతిచ్చిందన్నారు. జన వరి 5 నుంచి 8వతేదీ వరకు నెల్లూరు క్లబ్ ప్రాంగణంలోనే పోటీల నిర్వహ ణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ పోటీలకు దేశంలోని 24 రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాలు, భారతీయ సంస్థలకు చెందిన 400 మంది క్రీడాకారులు, వీరితో పాటు 8 మంది ప్రపంచ చాంపియన్లు పోటీలకు హాజరవుతున్నారన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి అంతర్జాతీయ క్యామర్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్ మేయర్, ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, అస్సాం ఎంపీ రకిబుల్ హుస్సేన్, ప్రతినిధులు, జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, అధికారు లు హాజరవుతారని తెలిపారు. జిల్లావాసులు, క్రీడాకారులు పోటీలను తిలకిం చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నెల్లూరు క్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, జిల్లా క్యామర్ అసోసియేషన్ కార్యదర్శి వీ రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏదీ!?

- పారిశుధ్యం మెరుగుకు వాహనాల కొనుగోలు
- నిర్వహణ లేక అనతికాలంలోనే మూలకు
- కావలిలో తుప్పుపడుతున్న వాహనాలెన్నో

ఆంధ్రజ్యోతి పరిశీలన

పారిశుధ్యం మెరుగుదలకు కావలిలో చేపట్టిన పలు ప్రయోగాలు సత్ఫలితాలు ఇవ్వక అవి చెత్త ప్రయోగాలుగా మిగిలి పోయాయి. మున్సిపల్ ఖజానా నుంచి రూ.కోట్లు పోసి కొనుగోలు చేసిన వాహనాలు నిర్వహణ లోపం కారణంగా తుప్పుపడుతున్నాయి. చిన్నపాటి మరమ్మతుకు గురైనప్పుడే వాటిని బాగు చేసి ఉంటే జీవితకాలం పని చేసి ఉండేవి. అలాంటిది అధికారులు వదిలేయడంతో రోడ్లపక్కన, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మట్టిలో కలిసిపోతున్నాయి. కాలం చెల్లిన వాహనాలను బహిరంగ వేలం వేసి విక్రయించాలంటే రవాణా శాఖ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) తీసుకోవాలి. ఇందుకుగాను ఎప్పటికప్పుడు రవాణా శాఖ అధికారుల నుంచి ఎఫ్‌సీలు తీసుకోలేదు. ఇప్పుడు తీసుకోవాలన్నా ఆ శాఖకు భారీస్థాయిలో పెనాల్టీలు చెల్లించాలి. దీంతో మూలనపడ్డ వాహనాలకు వేలం ద్వారా వచ్చే డబ్బులు కన్నా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం చెల్లించే పెనాల్టీలే ఎక్కువవుతున్నందున వాటిని అలా వదిలేశారు. చివరకు అవి పాత ఇనుము తుప్పుకు కూడా పనికి రాకుండా పోతున్నాయి.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



ఒకప్పుడు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించిన ఆటోలు ఇవి. సేకరించిన చెత్తను ఆ ఆటోలద్వారానే కంపోస్ట్ యార్డుకు తరలించేవారు. అయితే, కంపోస్ట్ యార్డు పట్టణానికి దూరంగా వెళ్లటంలో ఆ ఆటోలను ఇదిగో ఇలా పక్కన పెట్టేశారు. ఆ తర్వాత కూడా క్లాప్ ప్రోగ్రాం కింద తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ఒక ఏజెన్సీ సంస్థ 8 ఆటోలను మున్సిపాలిటీకి నెలసరి అద్దె ప్రాతిపదికన అప్పగించింది. ఇప్పుడు వాటిని కూడా మూలన పడేశారు.



చిన్నసంధుల్లో చెత్త వేసేందుకు ఉంచిన చిన్న డంపర్ బిన్లను తరలించేందుకు ఈ ఆటోను కొనుగోలు చేశారు. కొంత కాలం దీనిని వినియోగించారు. పట్టణానికి దూరంగా కంపోస్టుయార్డును తరలించడంతో ఈ ఆటోను ఇదిగో ఇలా మూలన పడేశారు.



భారీ డంపర్ బిన్‌లను తరలించేందుకు ఈ లారీని కొనుగోలు చేశారు. హైడ్రాలిక్ సిస్టం ద్వారా డంపర్‌బిన్‌లను లారీలోకి ఎత్తి వాటిని కంపోస్ట్ యార్డుకు తీసుకెళ్లి అక్కడ చెత్తను పోసి తిరిగి యథాస్థితిలో డంపర్‌బిన్లను ఉంచేందుకు ఈ లారీ ఉపయోగపడుతుంది. ఇది బాగానే ఉన్నా డంపర్‌బిన్లలో చెత్త అక్కడే వాహనంలోకి లాక్కొనే కంపాక్టర్ వాహనాలు రావటంలో దీనిని వాడటం మానేశారు.



చెత్తను తరలింపులో మున్సిపాలిటీకి విశేష సేవలందించిన ట్రాక్టర్ ఇది. సరైన నిర్వహణలేక మరమ్మతుకుగురై ఇదిగో ఇలా మూలన పడేశారు. మూడు ట్రాక్టర్లను ఇలా మూలన పడేసి అద్దెకు మరో మూడు ట్రాక్టర్లు తీసుకుని తిప్పుతున్నారు.



వెడల్పాటి రోడ్లను శుభ్రం చేసేందుకోసం ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. అయితే, నిర్వహణంపై అవగాహన లేక దానిని మూలన పడేయటంతో తుప్పు పట్టి పాడైపోతోంది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని ప్రవేశ మార్గంలో ఇదిగో ఇలా ప్లాస్టిక్ పట్ట కప్పి ఉంచారు.



రోడ్లపై వెళ్లే వారు తమ వద్ద ఉన్న కాగితాలు, కవర్లు వంటి చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ఇలా స్టాండ్‌లు ఏర్పాటు చేసి డబ్బాలు అమర్చారు. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఆ డబ్బాలు మయం అయ్యాయి. వాటి కోసం అమర్చిన స్టాండ్‌లు మాత్రం ఇదిలో ఇలా దర్శనం ఇస్తున్నాయి.



రోడ్లకు ఇరువైపులా, డివైడర్ల మధ్యలో మొక్కలు నాటేందుకు కోసం రంధ్రాల ఏర్పాటుకు ఈ యంత్రాన్ని వినియోగించేవారు. సంవత్సర కాలంపాటు మున్సిపాలిటీకి సేవలందించింది. ఆ తర్వాత ఇలా మూలకు చేరింది.



పెద్ద పెద్ద మురుగు కాలువలలో పూడిక తీసేందుకు ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. కొంతకాలం దీనిని వినియోగించి, ఆ తర్వాత మరమ్మతుకు గురవడంతో ఇలా సేదతీరుతోంది.

లైఫ్ సర్టిఫికెట్లకు
వేళాయె!

- పెన్షనర్ల జీవన ధ్రువీకరణకు సర్టిఫికెట్ల సమర్పణ
- ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షన్ దారులు తాము జీవించి ఉన్నట్లు ధ్రువీకరిస్తూ ప్రతి సంవత్సరం సంబంధిత ట్రెజరీల్లో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. అలా సమర్పిస్తేనే వారికి పెన్షన్ ఆగకుండా కొనసాగు తుంది. లేకపోతే పెన్షన్ ఆగిపోతుంది. అదే జరిగితే పెన్షన్‌ను పునరుద్ధరించుకోవడానికి నానా ఇబ్బందులు పడాలి.

జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు

ప్రభుత్వ పెన్షన్‌దారులు 2025వ సంవత్సరానికి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి జిల్లాలోని అన్నీ ట్రెజరీ కార్యాలయాలతోపాటు, కొన్ని ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ధ్రువీకరణలు సమర్పించవచ్చు.





స్వీకరణ కేంద్రాలు

- డివిజనల్ ఉపఖజానా కార్యాలయం లోని అసిస్టెంట్ ట్రెజరీ అధికారి
- బీవీ నగరంలోని పెన్షన్‌దారుల భవనం
- పాత జడ్పీ భవనంలోని పెన్షన్‌దారుల సంఘం కార్యాలయం
- రెవెన్యూ పెన్షన్‌దారుల కార్యాలయం (జనవరి 6,7,8 తేదీలలో)
- మూలాపేటలోని సరస్వతీ సమాజ భవనం
- దర్గామిట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- ఏసీ నగర్‌లోని మునిసిపల్ పాఠశాల



లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరి

ప్రభుత్వ పెన్షన్‌దారులు తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పిం చాలి. జిల్లా ట్రెజరీ డీడీ గంగాద్రి ఆదేశాలతో నెల్లూరు నగరం లో మా కార్యాలయంతో పాటు ప్రత్యేక కేంద్రాలలో ఈ సర్టిఫికెట్లు తీసుకునే ఏర్పాట్లు చేశాం. పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

- ఎస్కే అహ్మద్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్

ఆదాయం ఎక్కడ!?

(5వ పేజీ తరువాయి)

అయిన ఎంఐజీ లేఅవుట్లపై చైర్మన్ శ్రీనివాసులురెడ్డి దృష్టి సారించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

- భారీగా లేఅవుట్ల ఏర్పాటు

నుడా పరిధిలోని 8 నియోజకవర్గాల్లో పెద్దఎత్తున ఎంఐజీ లేఅవుట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో లేఅవుట్లకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 100 ఎకరాల మేర లేఅవుట్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో నుడా యంత్రాంగం భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో కావలిలో 97 ఎకరాలు, కందుకూరులో 25 ఎకరాల్లో నుడా లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఇందులో కావలిలోని లేఅవుట్‌లో దాదాపు 70 శాతం ప్లాట్లు అమ్ముడుపోయాయి. కందుకూరులో కేవలం 20 శాతం ప్లాట్లు మాత్రమే అమ్ముడుపోయాయి. దీంతోనే నుడాకు రూ.25 కోట్ల మేర నిధులు సమకూరాయి. తక్కువ ధరలకు మధ్యతరగతి, ఉద్యోగులకు ప్లాట్లు విక్రయించడం ద్వారా భారీగా నిధులు సమకూర్చుకునే అవకాశం నుడాకు కలుగుతుంది. ఇందు కోసం లేఅవుట్లకు అనువుగా ఉన్న భూములను నుడాకు కేటాయించాలని మంత్రి నారాయణ కలెక్టర్ ఆనంద్‌ను ఆదేశించడంతో ఆ బాధ్యతలు జేసీకి అప్పగించారు. మార్చి నాటికి కనీసం 100 నుంచి 200 ఎకరాల మేర లేఅవుట్లు వేసేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములతోపాటు ముందుకు వచ్చే ప్రైవేటు వ్యక్తుల భూములను కూడా తీసుకొని డెవలప్‌మెంట్ పద్ధతిలో వాటిని అభివృద్ధి చేసి ప్లాట్లను విక్రయించేలా నుడా యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు భూములలో లేఅవుట్లు ఏర్పాటు చేయడం ద్వారా రూ.వందల కోట్లు ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు కసరత్తు జరుగుతోంది.

ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు ముందడుగు

- ఎంపీ వేమిరెడ్డి కృషితో అధికారుల రాక.. స్థల పరిశీలన

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఈఎస్ఐ జిల్లా ఆసుపత్రి ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసి ఆసుపత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయటంతో శుక్రవారం పరిశీలనకు అధికారులు వచ్చారు. విజయవాడ నుంచి ఈఎస్ఐ రీజనల్ డైరెక్టర్ వేణుగోపాల్, డాక్టర్ ప్రదీప్, దత్తాత్రేయ, రవికుమార్, కర్తాన్ సింగ్, లీలాకుమారితో కూడిన బృందం నగరం లోని ఈఎస్ఐ డిస్పెన్సరీని సందర్శించి అక్కడ ఖాళీగా ఉన్న 2.18 ఎకరాల స్థలాన్ని పరిశీలించింది. రెండు రోజుల్లో కేంద్రానికి నివేదిక అందచేయనున్నట్లు బృందంలోని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని తెలిపారు. దీనివల్ల అసంఘటిత రంగ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.



నెల్లూరు ఈఎస్ఐ డిస్పెన్సరీ స్థలంలో పరిశీలిస్తున్న అధికారుల బృందం

మహోన్నత వ్యక్తి మన్మోహన్!

- ప్రముఖుల నివాళులు

ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ప్రగతికి మెట్లు వేసిన మహోన్నత వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని, ఆయన మృతి దేశానికి తీరనిలోటుగా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానిగా ఎన్నో విప్లవాత్మక చట్టాలను తీసుకొచ్చిన గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమంటూ సంతాపం వ్యక్తం చేశారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

- మంత్రుల సంతాపం

నెల్లూరు (వైద్యం) : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ వేర్వేరు ప్రకటనలో వెల్లడించారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామని పేర్కొన్నారు. మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలో తాను రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా పనిచేశానని ఆనం వెల్లడించారు. భారత ఆర్థిక మంత్రిగా ఎన్నో సంస్కరణలు చేపట్టారని ఆర్టీఐ, ఉపాధిహామి పథకం వంటి ఎన్నో పథకాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

- దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది - ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం) : మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని, దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతాపం తెలియచేశారు. అలాగే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కూడా మరో ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఎన్నో విప్లవాత్మక సంస్కరణలను ఆయన తీసుకొచ్చి ప్రజల అభ్యుదయానికి కృషి చేశారంటూ కొనియాడారు.

- కాంగ్రెస్ నేతల నివాళి

నెల్లూరు (వైద్యం) : నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభంలోనూ దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు మన్మోహన్‌సింగ్ అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజయ్‌కుమార్, మోహన్‌రెడ్డి, అల్లాఉద్దీన్, మల్లిఖార్జునరెడ్డి, సుధీర్, గణేష్, సుజాత, ఇర్ఫాన్, కిశోర్, సుధాకర్‌రెడ్డి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

- వీఎస్‌యూలో..

వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. వీసీ సారంగం విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను గ్లోబల్‌స్థాయికి తీసుకెళ్లాయన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అల్లం ఉదయ్ శంకర్, సుజాఎస్ నాయర్, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులున్నారు.



వెంకటాచలం : వీఎస్‌యూలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత

కావలి ఐఎంఏకు జాతీయ అవార్డు

కావలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కావలి శాఖ ఆధ్వర్యంలో ఒకేరోజు 1274 యూనిట్ల రక్త సేకరణ చేపట్టారు. దీనికి గుర్తింపుగా జాతీయ అవార్డు లభించింది. శుక్రవారం హైద్రాబాద్ లో జరిగిన జాతీయ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 99వ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు అశోకన్, కార్యదర్శి అనిల్‌కుమార్ నాయక్ నుంచి కావలి శాఖ అధ్యక్షుడు కారుమంచి



సుబ్బారావు, కార్యదర్శి గోపి, కోశాధికారి పాములూరు శివప్రసాద్ పురస్కారాన్ని అందుకున్నారు. వైద్యుల సేవాభావం, ఐక్యత వల్లే అవార్డు దక్కిందని చెప్పారు.

యూరియా కొరతను తక్షణం తీర్చాలి

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెలకొన్న యూరియా కొరతను ప్రభుత్వం వెంటనే తీర్చాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులు అవసరమవుతాయని, కానీ వ్యవసాయ శాఖ అధికారులు రెండు లక్షల మెట్రిక్ టన్నులు సరిపోతాయని ప్రకటించం విచారకరమన్నారు. సాగవుతున్న పంటలకు ఎరువులు అందించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.





శాశ్వత పరిష్కారం ఏదీ?

ఇటీవల కురిసిన వర్షాలతో తుమ్మలపెంట రోడ్డు సమీపంలోని లేఅవుట్లు, అందులో ఉన్న ఇళ్లు గురువారం రాత్రి కురిసిన వర్షంతో జలమయమం అయ్యాయి. శుక్రవారం ఉదయం కూడా తుమ్మలపెంట రోడ్డులో వరదనీరు పారుతోంది. రోడ్డుకిరువైపు ఉన్న పెద్ద కాలువలు ఆక్రమణకు గురికావటం వలనే పాపిరెడ్డి చెరువు అలుగు నుంచి వచ్చే వర్షపు నీరు లేఅవుట్లనే నిలుస్తుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించేందుకు ఈ ప్రాంతంలో పెద్ద పైపులైన్‌లను ఎక్సకవేటర్‌తో తొలగించి నీరు కిందకు వెళ్లేలా చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఆక్రమణలను తొలగించి పెద్ద కాలువలను నిర్మించితే తప్ప ఈ కష్టాలు తీరవని బాధితులు చెబుతున్నారు.

- కావలి (ఆంధ్రజ్యోతి)

నేర వార్తలు (crime news) ఆంధ్రజ్యోతి

బైక్‌ను ఢీకొన్న లారీ యువకుడి మృతి

- ప్రాణాలు తీస్తున్న హైవేపై గుంతలు
- రోడ్డుభద్రత అధికారులపై మండిపడుతున్న ప్రయాణికులు

మనుబోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మనుబోలు మండలం కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వాకాడు మండలం రెడ్డిపాళెం గ్రామానికి చెందిన మల్లాపు దేవేంద్రబాబు (23) నెల్లూరులో ఉన్న స్నేహితులను కలిసేందుకు మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళుతుండగా వంతెన ముందు ఉన్న గుంత దగ్గరకు వచ్చేసరికి హఠాత్తుగా బ్రేక్‌వేసి మోటార్‌సైకిల్ నిలిపాడు. ఇంతలో నెల్లూరు నుంచి చెన్నైకు వెళుతున్న లారీ ఆగిఉన్న మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్ బోల్తాపడింది. దీంతో రోడ్డుపై పడిన దేవేంద్రబాబుపైనుంచి లారీ ముందుచక్రాలు వెళ్లడంతో అతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. దేవేంద్రబాబు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ శ్రీనువాసులు తెలిపారు.



లారీ పక్కన పడి ఉన్న దేవేందర్ మృతదేహం

ప్రమాదం జరిగిన తరువాతే అధికారుల్లో చలనం



గుంతను పూడ్చుతున్న సిబ్బంది

ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతేగాని రోడ్డుపై గుంతలను రోడ్డు భద్రతా అధికారులు పట్టించుకునేలా కనబడడం లేదు. ఉదయం ప్రమాదం జరగగానే మధ్యాహ్నానికల్లా గుంతను పూడ్చివేశారు. వారం రోజుల వ్యవధిలో మూడుకార్లు, ఒక టిప్పర్, ఆటో, రెండు మోటార్‌సైకిళ్ళు గుంతలో పడి దెబ్బతిన్నాయి. అలాగే బాధితులు ఆసుపత్రిలో మంచాలపై మూలుగుతున్నారు. ఇంతమంది ప్రమాదాల బారినపడడానికి ఐజేఎం అధికారుల నిర్లక్ష్యమేనని ప్రయాణికులు మండిపడుతున్నారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని జీ.అయ్యవారిపల్లి గ్రామ సమీప అటవీ ప్రాంతంలో శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సింగనబోయిన పోతయ్య తన జీవాలను సమీప అటవీ ప్రాంతానికి మేతకు తోలుకెళ్లాడు. ఈ క్రమంలో చెట్ల పొదల్లో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా అతనిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దాని బారినుంచి తప్పించుకొని రోడ్డుపైకి పరుగులు తీసిన పోతయ్య గ్రామస్థులకు సమాచారం అందించాడు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని పోతయ్యను ఆటోలో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న వైద్యశాలకు చేరుకొని క్షతగాత్రున్ని పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఉన్నతాధికారులతో చర్చించి ఎలుగుబంటిని నియంత్రించడంతోపాటు పరిహారం వచ్చేలా చర్యలు చేపడతామని బాధితునికి భరోసా ఇచ్చారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న పోతయ్య

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ దుర్మరణం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కల్లూరుపల్లి ఇందిరమ్మకాలనీకి చెందిన ఎం వేణుకుమార్(49) నగరంలోని అన్నమయ్య సర్కిల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం పనికి వచ్చి రాత్రి ఇంటికి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 26వ తేది రాత్రి పని ముగించుకొని స్కూటీపై కొండాయపాలెం మీదుగా ఇంటికి బయలుదేరాడు. అంబర్‌ఉడ్ పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి ఏమైందో తెలియదు కానీ వేణుకుమార్ స్కూటీపై నుంచి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మెడికవర్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా మృతుడికి భార్య చిన్ని, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఇద్దరి అదృశ్యంపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటనలపై పోలీసు అధికారులు కేసులు నమోదు చేశారు. కిసాన్ నగర్‌కు చెందిన మోహిత్ తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల మొదటి వారంలో కళాశాల నుంచి ఇంటికి వచ్చిన మోహిత్ 4వ తేది ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు అతని కోసం గాలించినా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు అతని తండ్రి శుక్రవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే డైకస్‌రోడ్డు చేపల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న గయాజ్ కుమార్తె 7వ తరగతి వరకు చదువుకుని ఇంట్లోనే ఉంటోంది. ఈనెల 26వ తేది సాయంత్రం స్కార్ఫ్ తెచ్చుకుంటానని చెప్పి తన పిన్నితో కలిసి దుకాణానికి వెళ్లి అక్కడ నుంచి అదృశ్యమైంది. బాధిత కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించినా జాడ తెలియకపోవడంతో తండ్రి శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7350
వెండి కిలో ధర	రూ. 90,300
వెండి ఒక గ్రాము	రూ.93.30

రూ.110 కోట్లతో మినీ గోకులాలు, సీసీ రోడ్లు

- డ్వామా పీడీ గంగాభవాని

మనుబోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.110కోట్లతో మినీ గోకులాలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. ఆమె మండలంలోని చెరుకుమూడి, కొమ్మలపూడిలో ఉపాధి నిధులతో జరుగుతున్న నిర్మాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. రూ.30కోట్లతో 1125 మినీ గోకులం షెడ్లు, రూ.80కోట్లతో 1121 సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేయిస్తున్నాని చెప్పారు. నాణ్యత లేకుండా పనులు జరిగితే బిల్లులు చెల్లించడం జరగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఏపీవో రాజమ్మ, టీఏలు సుప్రజ, గుర్రప్ప పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్లలో తనిఖీలు

- నాలుగు క్వాలిటీ కంట్రోలు బృందాల ఏర్పాటు
- కలెక్టర్ ఉత్తర్వులు జారీ

కలువాయి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హౌసింగ్ లేఅవుట్లలో జరిగిన అభివృద్ధి పనులను తనిఖీ చేయాలని జిల్లా క్వాలిటీ కంట్రోలు బృందాలను ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. డ్వామా సీనియర్ క్వాలిటీ కంట్రోలు అధికారులు వీ సతీష్‌బాబు, జూనియర్ క్వాలిటీ కంట్రోలు అధికారులు సీహెచ్ కిషోర్‌బాబు, ఎస్‌కే కలీలయ్య టీం లీడర్లుగా నాలుగు బృందా లను ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బృందాలు జిల్లా లోని అన్ని హౌసింగ్ లేఅవుట్‌లలో జరిగిన పనులను తనిఖీ చేసి వారం రోజుల్లోపు నివేదికలు అందించాలని అదేశాలు జారీచేశారు.

కాగా, క్వాలిటీ కంట్రోలు అధికారుల తనిఖీలలో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో జగనన్న హౌసింగ్ కాలనీల పేరుతో పెద్ద ఎత్తున లేఅవుట్‌లు ఏర్పాటుచేసి అందులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. కలువాయి మండలంలో రూ. 3.45కోట్ల అంచనా విలువతో 36 లేఅవుట్ పనులు చేశారు. ఇందుకు గాను రూ.1.08 కోట్లు బిల్లులు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించింది. ఇంకా రూ.2.36కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే చాలా లేఅవుట్‌లలో ఈ పనులు తూతూ మంత్రంగా చేసినట్లు, చేయని పనులకు కూడా ఎం.బుక్‌లు రికార్డు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



చింతలపాళెం గ్రామంలో వేసిన హౌసింగ్ లేఅవుట్

మునిసిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు నెల్లూరు, గూడూరు, కావలి మునిసిపల్ పాఠశాలలకు చెందిన ఎస్‌జీటీ, తత్సమాన కేడర్ కలిగిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు పర్యవేక్షణలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది కౌన్సెలింగ్ నిర్వహించి స్కూల్ అసిస్టెంట్ గణితం ఒకరికి, ఫిజికల్ సైన్స్‌లో ముగ్గురికి, బయలాజికల్ సైన్స్‌లో ఇద్దరికి, సోషల్‌లో నలుగురుకి, ఇంగ్లీష్‌లో ముగ్గురికి, ఫిజికల్ డైరెక్టర్ ఒకరికి కలిపి మొత్తం 14 మందికి పదోన్నతులు కల్పించారు. వీరిలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల్లో 11 మంది, కావలి, గూడూరు మునిసిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో ముగ్గురు పదోన్నతి పొందినట్లు డీఈవో తెలిపారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను నియామక ఉత్తర్వులు అందజేశారు.



ఉపాధ్యాయులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న డీఈవో బాలాజీరావు

రెవెన్యూ సదస్సులో అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వండి

- చీఫ్ గ్రీవెన్స్ అధికారి చిన్నారావు

నెల్లూరు(జడ్పీ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను బాధ్యతగా పరిశీలించి వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చీఫ్ గ్రీవెన్స్ అధికారి చిన్నారావు అధికారులను ఆదేశించారు. సీఎం కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన జడ్పీ సీఈవోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారం కాకపోతే దానికి గల కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. పరిష్కారం కావాలసి ఉన్నప్పటికీ ఆలస్యం చేసినా, నిర్లక్ష్యం వహించినా, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై జడ్పీ సీఈవో విద్యారమ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించామన్నారు. అర్జీదారులు సంతోషం చెందేలా ప్రతి ఒక్కరు పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పొదలకూరు నిమ్మ మార్కెట్‌లో దుకాణాలకు వేలం

- పోటాపోటీగా పాల్గొని దక్కించుకొన్న వ్యాపారులు



యార్డులో వేలంపాటలు నిర్వహిస్తున్న మార్కెంటింగ్ శాఖ అధికారులు

పొదలకూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులోని దుకాణాలకు శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో వ్యాపారులు పోటాపోటీగా పాల్గొని దక్కించుకున్నారు. పొదలకూరు నిమ్మ మార్కెట్‌లోని పది దుకాణాలకు గుంటూరు జేడీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహిం చారు. తొలుత 24 నెంబరు దుకాణానికి గురవయ్యనాయుడు, మల్లికార్జున్‌లు పోటీపడ్డారు. మల్లికార్జున్ రూ.26వేలకు దక్కించుకున్నాడు. ఇదే వరుసలో ఉన్న 26, 27 నెంబరు గల దుకాణాలకు తక్కువ పోటీలో రూ.6వేలకే మహేంద్ర, హంస కుమార్ దక్కించుకున్నారు. ఇలా మిగిలిన దుకాణాలకు రూ.18వేలు, రూ.16,600 వంతున పోటీపడి దక్కించుకున్నారు. వేలంపాటలో దుకాణాలు పొందిన వ్యాపారులు వారం రోజులలోపు అగ్రిమెంటు చేసుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ వేలం పాటల్లో నెల్లూరు ఏడీఎం అనితాకుమారి, మార్కెంటింగ్ శాఖ డీఈఈ హరినారాయణరెడ్డి, ఏఈ వినోద్ కుమార్, పొదలకూరు, నెల్లూరు మార్కెంటింగ్ కార్యదర్శులు ఇలియాస్, శ్రీనివాసులు, సూపర్‌వైజర్ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్కంఠ రేపుతున్న మద్యం పోరు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెంలో ఆరంభమైన మద్యం పోరు రోజురోజుకూ ఉత్కంఠ రేపుతోంది. ఇటీవల ఉదయగిరిలో ఉన్న ఓ మద్యం దుకాణాన్ని గండిపాళెంకు తరలించేందుకు నిర్వాహకులు ప్రయత్నాలు సాగిస్తున్నారన్న సమాచారం అందుకున్న గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ, జనసేన నాయకులు తమ గ్రామంలో మద్యం దుకాణం వద్దంటూ మహిళలతో కలిసి ఆందోళన చేపట్టారు. గతంలో అధికారికంగా ఉన్న దుకాణాన్ని ఆందోళనలతో లేకుండా చేశామని నిరసన కొనసాగించారు. వైసీపీ హయంలోను ప్రభుత్వ మద్యం దుకాణం తమ గ్రామంలో లేకపోవడంతో ప్రశాంత వాతావరణం కొనసాగుతోందని అధికారులకు సైతం విన్నవించారు. అయితే అందుకు విరుద్ధంగా ఊహించని రీతిలో టీడీపీకి చెందిన మరికొంతమంది తమ గ్రామంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళలతో కలిసి రోడ్లపై నినాదాలు చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన టీడీపీలోనే ఓ వర్గీయులు మద్యం దుకాణానికి అనుకూలంగా, మరో వర్గీయులు వ్యతిరేకంగా బహిరంగంగానే ఆందోళన బాట పట్టడంతో ఏ సమయంలో ఎలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటాయోననే ఉత్కంఠ అందరిలో నెలకొంది. తాజాగా గ్రామ శివారున ప్రధాన రహదారికి సమీపంలో అన్ని హంగులతో దుకాణాన్ని ఏర్పాటు చేసే పనుల్లో నిమగ్నమైన నిర్వాహకులు బ్రాందిషాపు త్వరలో ప్రారంభమంటూ ఆరుబయట బహిరంగంగానే ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. కాగా, ఈ తతంగమంతా శాసనసభ్యుడు కాకర్ల సురేష్ దృష్టికి సైతం వెళ్లినట్లు తెలిసింది. ఈపరిస్థితుల నేపథ్యంలో ఏ వర్గీయులు తమ పంతం నెగ్గించుకుంటారో, నిర్వాహకుల తీరు ఎలా ఉంటుందో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కావలి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచితవ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని దళిత, బహుజన, మైనార్టీ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం వారు ఈ విషయంపై స్థానిక ట్రంకు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట అంబేద్కర్ బొమ్మలు ఉన్న ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు అనుభవిస్తున్న పాలకుల రాజ్యాంగ నిర్మాతనే అవమానిస్తూ మాట్లాడటం బాధాకరం అన్నారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగం మీద దాడి చేస్తుందని మండిపడ్డారు. దేశ ప్రజలందరూ రాజ్యాంగ రక్షణ కోసం, రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగింపునకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆనంద్, ఎల్లంటి వెంకటేశ్వర్లు, ప్రసన్నాంజనేయులు, బాలకృష్ణ, కరువది భాస్కర్, పసుపులేటి పెంచలయ్య, తాళ్లూరు మాల్యాద్రి, నాగరాజు, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, ఎస్.మల్లి, ఎల్.శ్యామల, చిన్ని వరప్రసాద్, ప్రభాకర్, ఎస్‌కే.జిలానీ, సిరాజ్, సంషా, అయూబ్, బాంద్‌బాష, జయప్రకాష్, పుల్లయ్య, సుకుమార్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళిత, బహుజన, మైనార్టీ, వామపక్ష నాయకులు

బోగోలు జూనియర్ అసిస్టెంట్ జయలక్ష్మి సస్పెన్షన్

కావలి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యాలయ జూనియర్ సహాయకురాలు జయలక్ష్మిని సస్పెన్షన్ చేస్తూ శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె గతంలో ఇన్‌చార్జి కార్యదర్శిగా చేసిన అక్రమాలపై జరిపిన విచారణలో నిజాలు రుజువు కావటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై పూర్తిస్థాయి విచారణ అయ్యే వరకు జయలక్ష్మి జిల్లా పంచాయతీ అధికారి అనుమతి లేకుండా బోగోలు పంచాయతీ వదిలి వెళ్ల కూడదని చెప్పారు. సస్పెన్షన్‌లో ఉన్న జయలక్ష్మి జీవనాధారం నిమిత్తం సగం జీతంను చెల్లించాలని మండల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. ఈ అక్రమాలపై గతంలో బోగోలు మాజీ ఎంపీటీసీ చిలకపాటి శ్రీనివాసులు లిఖిత పూర్వకంగా చేసిన ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

సర్వీస్ ప్రొవైడర్లు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గ్లీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ రిపేరు చేసేవారు, బ్యూటీషియన్, బార్బర్, తదితర సేవలు అందించే సర్వీస్ ప్రొవైడర్లు తమ సేవలు అందించడానికి దరఖాస్తు చేసుకోవాలని మెప్మా పీడీ పద్మ ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసి తద్వారా వారికి జీవనోపాధి కల్పిస్తామని తెలిపారు. అందుకు ఆసక్తి కలిగిన వారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే జనవరి 1 నుంచి 7 వరకు అన్ని మున్సిపాలిటీల్లో సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు 7901311585ను సంప్రదించాలని తెలిపారు.

వీఆర్ లా కాలేజీలో డిష్యూం.. డిష్యూం!

- చిన్నబజారు స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు
- పోలీసుల రంగప్రవేశం
- ఇరువర్గాలకు కౌన్సెలింగ్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వీఆర్ లా కళాశాలలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ రాష్ట్ర వ్యాప్తంగా సంచల నంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. తనతో జూనియర్ విద్యార్థి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వెంబడిస్తున్నారని సీనియర్ విద్యార్థిని ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులు, స్నేహితులు గురువారం కళాశాల ప్రాంగణంలో జూనియర్ విద్యార్థిపై దాడి చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న విద్యార్థి స్నేహితులు అడ్డుకోవడంతో రెండు వర్గాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. ఈ దాడులపై శుక్రవారం చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో రెండు వర్గాలకు చెందిన ముగ్గురు స్పరస్పరం ఫిర్యాదు చేశారు. సీనియర్ విద్యార్థిని తనను కులం పేరుతో దూషించా రంటూ జూనియర్ విద్యార్థి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కళాశాలకు చేరుకొని ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. అనంతరం సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించారు. రెండు వర్గాల విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండు విద్యార్థి సంఘాలకు చెందిన విద్యార్థులు ఆధిపత్యం కోసం గొడవపడుతున్నట్లు తెలుస్తోందన్నారు. అయితే మూడు ఫిర్యాదులపై ఏలాంటి కేసులు నమోదు కాలేదు. కాగా, విద్యార్థులు గొడవ పడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పనులు ప్రారంభించారు.. వదిలేశారు..

● నత్తనడకన హైవే-325 నెంబరు రోడ్డు పనులు ● వంతెనల నిర్మాణంతో రోడ్డు ధ్వంసం.. డైవర్షన్లు

జలదంకి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021లో జలదంకి నుంచి తెల్లపాడు మీదుగా కలిగిరి మండలాల్లోని గ్రామాల మీదుగా వెళ్లే సింగిల్ రోడ్డును హైవే-325 నెంబరు రోడ్డుగా మార్చేందుకు రూ.16కోట్లతో టెండర్లను పిలిచింది. పనులు దక్కించుకున్న జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ అప్పటి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించింది. మండలంలోని దాసరి అగ్రహారం, తిమ్మసముద్రం గ్రామాల సమీపంలోని వాగులు, వరదనీరు వెళ్లే ప్రాంతాలతో కల్వర్టు, వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. చేసిన పనులకు నిధులు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. అధికారంలోకి కూటమి ప్రభుత్వం రెండు నెలల క్రితం రూ.4కోట్లు బిల్లులు మంజూరు చేసినా గుత్తేదారుడు పనులు ప్రారంభించలేదు.


తిమ్మసముద్రం సమీపంలో నిలిచిన వంతెన నిర్మాణం

సాఫీగా ఉన్న రోడ్డు ధ్వంసం..

జలదంకి-తెల్లపాడు సింగిల్‌లైన్ బీటీ రోడ్డు ఉన్నపుడు ఎక్కడా గతుకులు లేకుండా వాహనదారులు సాఫీగా ప్రయాణించేవారు. ఈ రోడ్డును స్టేట్‌హైవేగా మార్చుచేసి రెండులైన్ల రోడ్డుగా మారుస్తామని బాగున్న రోడ్డును ధ్వంసం చేయడం, కల్వర్టుల స్థానంలో వంతెన నిర్మాణం చేపట్టే క్రమంలో వంతెనలు తొలగించి డైవర్షన్‌లు ఏర్పాటు చేయడం రోడ్డుకు ఇరువైపులా కంకరతోలి వదిలేశారు. రోడ్డు కట్ చేసిన చోట వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో కల్వర్టులు, డైవర్షన్‌ల వద్ద వర్షపు నీరు పొంగి పొరడంతో జలదంకి, కావలి పట్టణాలకే కాకుండా సుమారు 25గ్రామాల ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు.

పనులు ప్రారంభించాలి



బిల్లులు మంజూరై నెలలు గడుస్తున్నా కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టలేదు. గత వైసీ పీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వక మూడేళ్లుగా కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలంలో అయితే మా పరిస్థితి దయనీయం. వానాకాలంలో ఊరి నుండి జలదంకి, కావలికి రోజుల తరబడి రాలేని దుస్థితి. గతంలో బిల్లులు రాలేదని సాకులు చెప్పిన కాంట్రాక్టర్ బిల్లులు మంజూరైనా పనులు ఎందుకు చేపట్టడం లేదో అధికారులకే తెలియాలి.

- అంబటి హరిప్రసాద్‌నాయుడు, చింతలపాలెం

పనులు చేయమని నోటీసు ఇచ్చాం

నిలిచిపోయిన జలదంకి-తెల్లపాడు రోడ్డు పనులు చేయమని గుత్తేదారుడితో పాటు జీఎస్ఆర్ఇన్‌ఫ్రా సంస్థకు నోటీసు ఇచ్చాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, వానలు తగ్గితే పనులు చేపడతామని కాంట్రాక్టు చేపట్టిన సంస్థ బదులిచ్చింది. ఈ మేరకు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతాం.

- కె.చక్రధర్‌రావు, ఆర్అండ్‌బీ డీఈ, కావలి

పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

● ఎస్.ఆదినారాయణ, కొండాపురం ఎంపీడీఓ



మండలంలో 19, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆ దిశగా కార్యదర్శులతో పని చేయిస్తా మని ఎంపీడీఓ ఆది నారాయణ తెలిపారు.

ఇంటర్వ్యూ...

? సచివాలయ అధికారులు సమ యపాలన పాటిస్తున్నారా!

! 13సచివాలయాలను తరచూ తనిఖీ చేపడతాం. విధులకు రాని సిబ్బందికి మెమోలు ఇచ్చాం.

? గ్రామాల్లో ఇంటిపన్నులు వసూలు జరుగుతుందా!

! స్వర్ణగ్రామ్ పంచాయతీ యాప్‌లో 8500 ఇళ్ల డిజిటలైజేషన్ చేపట్టాం. దీనిద్వారా త్వరలో ఇంటిపన్ను వసూలు చేయనున్నాం.

? పంచాయతీల అభివృద్ధికి ఏ చర్యలు తీసుకుంటున్నారు!

! ప్రతి మూడునెలలకోసారి సర్పంచ్ అధ్యక్షతన సభ్యులతో సమావేశం అవుతాం. సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి పరిష్కరిస్తాం.

? చెత్త సేకరణ జరుగుతుందా!

! చెత్త సేకరణకు కేటాయించిన గ్రీన్ అంబాసిడర్లకు కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఈ సమస్యతో వారు విధులకు రావడం లేదు. సదరు గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడి ఇటీవలే జీతాలు విడుదల చేయించాం.

చుండిలో శ్రమదానం



వలేటివారపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చుండిలో ఉత్తర బజారుకు వెళ్లే రోడ్లకు రెండువైపులా శుక్రవారం మాలకొండ దేవస్థానం మాజీ ఛైర్మన్ చెరుపుపల్లి మాల్యాద్రి ఆధ్వర్యంలో గ్రామస్థులు శ్రమదానం చేశారు. 15రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు రోడ్లను కమ్మేశాయి. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల్లో విషపురుగులు ఉండే అవకాశం ఉందని, విష పురుగుల నుండి పాదచారులకు ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చు అనే ఉద్దేశ్యంతో ఈ చర్యలు తీసుకున్నట్లు వారు చెప్పారు.

ఖాదర్‌వలి గంధోత్సవం

అల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):స్థానిక మసీదు సెంటరులోని ఖాదర్‌వలి గంధ మహోత్సవం శుక్రవారం రాత్రి భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతెహాలను నిర్వహించి గ్రామోత్సవం చేపట్టారు. దర్గా కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన

కావలి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పట్టణంలో నిరసన చేపట్టారు. అంతకుముందు ట్రంకురోడ్డు బ్రిడ్జి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా విద్యుత్ డీఈ కార్యాలయం వరకు చేరుకున్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ, దామిశెట్టి సుదీర్‌నాయుడు, గంధం ప్రసన్న, పందిటి కామరాజు, కొమారి రాజు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, గుడ్లూరు మాల్యాద్రి, పరుసు మాల్యాద్రి, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

● కందుకూరు: విద్యుత్‌చార్జీల పెంపును నిరసిస్తూ కందుకూరులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా విప్పగుంటరోడ్డు చేపల మార్కెట్ సమీపంలోని విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయం వరకు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ పథకాల్లో పింఛన్లు మినహా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని నేటివరకు అమలుచేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, షేక్ రఫి, ముప్పవరపు కిషోర్, రావులకొల్లు బ్రహ్మనందం, సాంబశివరాజు, చీమల రాజా, ఈదర రమేష్, గేరా మనోహర్, అయ్యన్న పాల్గొన్నారు.



ఉదయగిరి: ర్యాలీలో పాల్గొన్న నాయకులు

● ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారం మోపుతోందంటూ నిరసన తెలియజేస్తూ పట్టణంలో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీ పీ శ్రేణులు పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సి పల్ బస్టాండ్ సెంటర్ నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేసి విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కా ర్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

● ఉదయగిరి: బూటకపు హామీలతో రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశాడని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయగిరి పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌కు ప్లకార్డులు చేతపట్టి నిరస న ర్యాలీ చేపట్టారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ట్రాన్స్‌కో ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేజర్ల సుబ్బారెడ్డి, అలీఅహ్మద్, మోడి రామాంజనేయులు, గణపం బాల కృష్ణారెడ్డి, జీ.ఓబులరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


కందుకూరు: పాల్గొన్న బుర్రా మధుసూదన్ యాదవ్


ఆత్మకూరు: పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, నేతలు

న్యూస్ బాక్స్

పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

కందుకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 31మందిని ఉద్యోగాలకు ఎంపికై నియామకపత్రాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ మస్తానయ్య తెలిపారు. ఏపీఎస్ ఎస్డీసీ, నెల్లూరు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మేళాలో ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, అమర రాజా బ్యాటరీస్, శ్యామ్‌సంగ్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా సంస్థల హెచ్‌ఆర్‌లు పాల్గొని ఇంటర్వ్యూలు చేశారని తెలిపారు. 76మంది విద్యార్థులు హాజరవగా వారిలో 31మందిని ఎంపికైనట్లు చెప్పారు.

ఎమ్మెల్యేకు సత్కారం


ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నాగూర్‌వలి

కందుకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్నారు షేక్ నాగూర్‌వలి. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి శాలువాతో సత్కరించారు. కళాశాలలో మధ్యాహ్నబోజన పథకం అమలు చేస్తున్నందున కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు మస్తాన్‌వలి, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య స్పైస్ ఇండస్ట్రీస్ ప్రారంభం

కందుకూరు సమీపంలోని శింగరబొట్లపాలెం వద్ద కనిగిరి రోడ్డులో ఆదిత్య స్పైస్ ఇండస్ట్రీస్‌ను ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభించారు. నిర్వాహకులు కొణిజేటి రవికుమార్, అనిల్‌కుమార్‌లను ఎమ్మెలేయ అభినందించారు.

అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఔదార్యం

లింగసముద్రం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):ముత్యాలపాడు సచివాలయ విజేల్ అగ్రికల్చరల్ అసిసెంట్ జంగాల ప్రేమ్‌బాబు ఐదేళ్లు జుట్టుని పెంచి క్యాన్సర్ పేషంట్ల కోసం హైదరాబాద్ హెయిర్ డొనేషన్ సంస్థ ద్వారా దానం చేశారు. ట్రీట్‌మెంట్‌లో భాగాంగా జుట్టు రాలిపోయే పెషంట్లకు అందజేస్తున్నట్లు తెలిపారు. పేషంట్ల ఆత్మ స్థైర్యాన్ని పెంచే కార్యక్రమంలో భాగసామ్యం అయినందుకు ప్రేమ్‌బాబు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రాజకీయాల్లోకి విద్యావంతులు రావాలి

బిట్రగుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే రాజకీయాల్లోకి చదువుకున్న యువత రావాలని బీజేపీ రాష్ట్ర ప్రతినిధి ఆర్టీ విల్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కమల కోరారు. బోగోలు బీజేపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడి నియామకం చేపట్టారు. నూకసాని శ్రీనివాసులును 32మంది బూత్ కమిటీ అధ్యక్షులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల మహిళ అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మీ, కావలి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మనందం, నేతలు మాధవ, మురళీనాయుడు, తిరుపతమ్మ ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి ఎన్నిక

చేజర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా చేజర్లకు చెందిన విజయభాస్కర్‌రెడ్డి ఎన్నిక య్యారు. శుక్రవారం చేజర్లలో జరిగిన కమిటీ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు కడుముల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బత్తల కిష్టయ్య, కుంకు బాల య్య, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

కావలి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మాజీ మున్సిపల్ ఛైర్మన్ ప్రముఖ వైద్యులు ప్రభాకర్ నాయుడు పీఎస్ఆర్ ట్రస్ట్‌లతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, రత్నం, ఉదయ్ పాల్గొన్నారు.


కావలి : నివాళులర్పిస్తున్న ప్రభాకర్ నాయుడు తదితరులు

ఎమ్మెల్యే కాకర్ల సంతాపం

వింజమూరు: ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ప్రగతికి మెట్లు వేసిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని ఎమ్మెల్యే కాకర్ల శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. మన్మోహన్‌సింగ్ మృతి తీరనిలోటని సంతాపం వ్యక్తంచేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



కావలి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): చౌదరిపాలెంలో విద్యుత్ స్తంభానికి, తీగలకు కమ్మేసిన పిచ్చి చెట్ల తీగలతో ప్ర మాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆహార సలహా సంఘం సమావేశాలేవి?

● ఈ సంఘం సమావేశాలను పూర్తిగా విస్మరించిన వైనం
● వైసీపీ హయాంలో ఒక్క సమావేశం జరగలేదు

వలేటివారిపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత ఐదళ్ల నుండి ఆహార సలహా సంఘం సమావేశాలు నిర్వహించ లేదు. గత వైసీపీ ప్రభుత్వం ఈ సంఘం సమావేశాలను పూర్తిగా విస్మరించింది. ఐదేళ్లలో ఏనాడు ఒక్క సమావేశాన్ని నిర్వహించిన దాఖలాలు కానీ ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును సమీక్షించింది లేదు. చివరికి ఆహార సలహ సంఘం ఉందనే సంగతి మరిచారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా రెవెన్యూ అధికారులు వాటిని కాగితాలకే పరిమితం చేశారు. ఈ సలహా సంఘం సమావేశంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు ఇద్దరు సర్పంచులు, ఇద్దరు సామాజిక కార్యకర్తలు, డ్వాక్రా మహిళ, తహసీల్దార్ ఏఎస్ఓ, ఉండాలి. ప్రతినెలా రెండో సోమవారం సమావేశం అయ్యేలా ప్రభుత్వం నుండి ఆదేశాలున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఆహార సంబంధిత వస్తువులు, సరుకులు ధరలు పెరిగినపుడు ఆహార సలహా సంఘం కమిటీ సభ్యులు వాటిని గమనించి అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే వీలు ఉంటుంది. క్షేత్రస్థాయిలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆరోపణలు, అవినీతి, అక్రమాలు జరుగుతుంటే అధికారులను నిలదీస్తారు. మార్కెట్‌లో వంట నూనెలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరల అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఐదేళ్లలో గత వైసీపీ ప్రభుత్వం ఆహార సలహా సంఘం సమావేశాలు ఊసే లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ సంఘం సమావేశాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘర్షణపై కేసు నమోదు

కావలి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం మానం సురేష్ తనకు రైతుభరోసా పడలేదని గురువారం సిరిపు రంలో వ్యవసాయశాఖ అధికారితో చర్చిస్తున్నారు. ఈ సమయంలో అక్కడే ఉన్న ఉప్పాల జాలరావు వారి మధ్య కలుగజేసుకున్నారు. దీంతో ఇరువురి మధ్య జరిగిన వాగ్వివాదంలో జాలరావు దాడి చేసి నట్లు బాధితుడు సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లక్పీ హుడ్ జాతర విజయవంతం చేయాలి


కందుకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మెప్మాలో వందరోజుల లక్పీ హుడ్ జాతరను విజయవంతానికి ఆర్పీలు, సీఓలు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ రాధమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారికి నిర్వహించిన శిక్షణలో పాల్గొని జాతర యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. సమావేశంలో కందుకూరు సీఎంఎం సంపత్, డీఈఓ శ్రవణ్ పాల్గొన్నారు. తొలిసారి కందుకూరు వచ్చిన ఆమెకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరించారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యే ఇంటూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉలవపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనవరి 2న స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశపెట్టనున్న మధ్యాహ్న భోజన పథకం ప్రారంభానికి ఉలవపాడు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యాపకులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుని కలిసి ఆహ్వానించారు. ఆయన వెంట అధ్యాపకులు గారపాటి గోపిచంద్ ప్రకాష్, హనుమంతరావు, చల్లా శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ రాము ఉన్నారు.

జనసేన క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతసాగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ క్యాలెండర్‌ను కూటమి నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనంతసాగరం చెరువు సొసైటి అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, బీజేపీ మండల కార్యదర్శి జగదీష్, టీడీపీ నేతలు చల్లాశివారెడ్డి, మెట్టుకూరు మనోజ్‌రెడ్డి, కేతా శ్రీనివాసులు రెడ్డి, బొర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ఉదయగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో శుక్రవారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజలు, రైతులు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి త్వరలో పరిష్కార మార్గం చూపుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్వో రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దుత్తలూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు నాగరాజు

●దుత్తలూరు: మండలంలోని ఏరుకొల్లు గ్రామంలో శుక్రవారం తహసీల్దారు నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై ప్రజలు, రైతులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయరు శివ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం : జండాదిబ్బలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లా నాయక్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అందచేసిన అర్జీలను విచారించి గడువు లోపు పరిష్కరిస్తామన్నారు.

సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

ఉదయగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సకాలంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని తహసీల్దారు సుభద్ర సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మడలంలోని చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ సమయం కావడంతో నిత్యావసర వస్తువుల పంపిణీలో సమయ పాలన పాటిస్తూ ప్రతి కార్డుదారుడికి సరుకులు అందేలా చూడాలన్నారు. 1 నుంచి 17వ తేదీలోపు సరుకులు పంపిణీ పూర్తిచేయాలన్నారు. నిత్యావసర వస్తువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు షాజియా, ఆర్‌ఐ సురేంద్ర, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

30న పంచాయతీలో వేలం

ఉదయగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మకూరు డీఎల్‌పీవో ఆధ్వర్యంలో వివిధ అంశాలకు సంబంధించి వేలంపాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ కరీముల్లా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్‌లో పది గదులు, పంచాయతీ బస్టాండ్‌లో రాకపోకలు సాగించే ప్రైవేటు వాహనాల నుంచి రోజువారి రుసుం వసూలు, శిథిలావస్థకు చేరిన చెత్త ఆటోలు, రిక్షాలు, పాత ఇనుప వస్తువులకు వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సొసైటీలో యూరియా విక్రయాలు ప్రారంభం

సంగం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో యూరియా విక్రయాలను శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల సంగం సొసైటీకి 445 బస్తాల యూరియా సరఫరా అయింది. ఆమేరకు సొసైటీలో యూరియా విక్రయాలను ప్రారంభించినట్లు పీఏసీఎస్ కార్యదర్శి దస్తగిరి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీ నిర్మల, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, పీఏసీఎస్ సీఈవో దస్తగిరి, సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరకు అమ్మకుండా చర్యలు

● చేజర్ల : మండలంలో ఎరువులు అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి విశిధర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలలో వ్యవసాయశాఖ సిబ్బందిని ఉంచి ఎరువుల అమ్మకాలు జరిపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా రైతు సేవా కేంద్రాలలో కూడా ఎరువులు విక్రయించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉదయగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆత్మకూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్దతులు పాటించడం లాభదాయకమని మండల ఆత్మకూరు ఏడీఏ వి దేవ సేనమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని మహిమలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో అందజేస్తున్న రాయతీలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి చంద్రశేఖర్, మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు, ఏపీసీఎన్‌పీ సిబ్బంది, వీఏఏడబ్ల్యూవోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.




మహిమలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ వి దేవసేనమ్మ

● ఏఎస్ పేట : భూసార పరీక్షలు చేసి నత్రజని వాడాలని మండల వ్యవసాయ అధికారి రజని రైతులకు సూచించారు. శుక్రవారం ఆమె చౌటభీమవరం, పందిపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి సాగులో జీవన ఎరువుల వినియోగంతో అధిక దిగుబడి సాధించవచ్చని, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఈవో చిరంజీవి, వీఏఏలు పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించాలి

సంగం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం పూర్తవడంతో అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని ఎంపీడీవో షాలెట్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకంపై ఎంపీడీవో సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణ పథకంలో 90 పనిదినాలు, ఇంకుడు గుంతలు, పశువుల షెడ్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపి మంజూరు చేయించుకోవాలని తెలిపారు. జాబ్ కార్డు కలిగిన కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించడంతోపాటు రూ. 300 కూలి గిట్టుబాటు అయ్యేవిధంగా పనులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సురేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సీసీలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ పథకంపై సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో షాలెట్

ఆరోగ్యకర సమాజానికి నమ్మకం పీఎంపీలు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 27(ఆంధ్ర జ్యోతి): అనారోగ్యంతో బాధపడేవారికి కావాల్సిన వైద్య సమాచారం, సహాయ సహకారాలు అందిస్తున్నది పీఎంపీలేనని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరంలోని దేవిశెట్టి కళ్యాణ మండపంలో శుక్రవారం 62వ పీఎంపీ డే జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణాలతో పాటు మారుమూల పల్లెల్లో సైతం పీఎంపీలు ఎంతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల జీవన శైలిలో సీఎంపీలు భాగస్వామ్యుల య్యారన్నారు. నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలలో పీఎంపీలు చురుగ్గా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేయించేకుందాం అన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాసు, చిట్టూరి వీరయ్య, నంద్యాల మాలిని, జయప్రకాష్, రమాదేవి, సత్తార్, రసూల్‌లు ప్రాథమిక వైద్య విజ్ఞానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, డాక్టర్ అశ్వినికుమార్, డాక్టర్ వెంకటతరుణ్, డాక్టర్ శ్వేత, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ ప్రేమ్‌దీప్, తదితరులు పాల్గొన్నారు.


సన్మాన కార్యక్రమంలో అధికారులు, వైద్యులు

కార్పొరేషన్‌లో 'నివా' కలకలం

● మాజీ ఆర్ఐ కృపాకర్ సస్పెన్షన్ ● ఇద్దరు మాజీ ఆర్వోలకు నోటీసులు

నెల్లూరు(సిటీ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థలో రెవెన్యూ, సిటీ ప్లానింగ్ విభాగాలను గత కొన్ని రోజులుగా కుదిపేస్తున్న చిల్డ్రన్స్ పార్కు వద్దనున్న నివా హస్పిటల్ వివాదం తాజాగా ఒక పాత ఆర్ఐ సస్పెన్షన్, మరో ఇద్దరు పాత ఆర్వోల వివరణ కోరుతూ నోటీసుల జారీకి దారితీసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ సూర్యతేజ మరిన్ని పరిణామాలుంటా యన్న సంకేతాలిచ్చారు. ప్రస్తుతం నడవడికలో ఉన్న నివా హస్పిటల్‌కు ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సులు తీసుకోకపోవడంలో కృపాకర్ సూచనలు అనుచరించినట్లు హస్పిటల్ నిర్వాహకులు ఇచ్చిన లిఖితపూర్వక వివరణతో చర్యలకు కమిషనర్ సిద్ధమై అతనిని సస్పెండ్ చేశారు. కాగ ఈ ఘటనతో సంబంధాలున్న పాత ఆర్వోలు శ్రీనివాసులు, రాజేశ్వరిలకు నోటీసులు జారీ చేసిన ఆయన లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. తదుపరి వివరణను బట్టీ చర్యలుంటాయని తెలిపారు. ఇదే ఘటనలో ఇప్పటికే స్థానిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీని సస్పెండ్ చేసిన విషయం విదితమే.

క్షయ, కుష్ఠు వ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాలి

● అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ, కుష్ఠువ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని క్రాంతినగర్, ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా ఆరోగ్య కేంద్రాలలో చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవటం, బరువు తగ్గిపోవటం, సాయంత్రం చెమటలు పట్టటం వంటి లక్షణాలతో బాధపడుతున్న వారందరూ దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాత్సల్య పాఠశాలలో చేపడుతున్న లెప్రసీ కేస్ డిటక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. డామియన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ట్రస్ట్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ వైద్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీపీఎంవో రమణారెడ్డి, ఆచారి, వేణు, వినయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

జగనన్న ఇళ్ల అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

వెంకటాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనికేపల్లి పంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ఇళ్లు కట్టకుండానే వైసీపీ నేతలు బిల్లులు డ్రా చేసుకొని మెక్కేశారని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆరోపించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎంపీడీవో కల్పనకు వినతిపత్రాన్ని అందజేశారు. జగనన్న లేఅవుట్‌ల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించి వైసీపీ నేతలు మెక్కేసిన సొమ్మును రికవరీ చేసి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చెమికల కిష్టయ్య, షేక్ సత్తార్ సాహెబ్, కాకి నిరంజన్, గుండెబోయిన వెంకటేశ్వర్లు, షేక్ మౌలాలి, చెమికల పుట్టయ్య, షేక్ మస్తానయ్య తదితరులున్నారు.

రైతు జీవితం తెలిపే సాహిత్యం ఎంతో విలువైంది

● వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు జీవితం గురించి తెలిపే సాహిత్యం ఎంతో విలువైందని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. స్థానిక వీఎస్‌యూలో శుక్రవారం తెలుగుశాఖ, సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ సంయుక్తంగా నిర్వహించిన లిటరరీ ఫోరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ విచ్చేసి మాట్లాడారు. సాహిత్యం సామాజిక విలువలకు దర్పణం లాంటిదని, తటాకాల నిర్మాణం, భూమి ప్రాశస్త్యం, రైతు జీవితం విశిష్టత, వ్యవసాయ రంగానికి సంబంధించిన మూలాలు ప్రాచీన సాహిత్యంలోనే కనిపిస్తాయన్నారు. పోతన, శ్రీనాథుల వంటి మహా కవుల రచనలు ఇందులో ఉదాహరణగా పేర్కొన్నారు. అనంతరం అనురాధ, రామకృష్ణ రచించిన రక్తఘోష పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్, కవి పెరుగు రామకృష్ణ, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డాక్టర్ గుండాల నరేంద్రబాబు, డాక్టర్ సుజా ఎస్ నాయర్, డాక్టర్ సీ రాజారాం, డాక్టర్ టీ విమల, డాక్టర్ లక్ష్మినారాయణరెడ్డి పాల్గొన్నారు.


రక్తఘోష పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత, సంపత్‌కుమార్

యాదవ్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీద రవిచంద్ర

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : యాదవ ఎంప్లాయీస్ సొసైటీ-2025 క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు యాదవ విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయంతో సొసైటీ పని చేయటం హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు దామెనబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్‌యాదవ్, పల్లా శ్రీనివాసుల యాదవ్, ఉప్పు కొండయ్య, ఏపీ శ్రీనివాసులు, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

నెల్లూరు(జడ్పీ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం- 2025 డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం నగరంలోని సీపీఆర్ కళ్యాణమండపంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సర్వేపల్లి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సతీష్, వాసుదేవ రెడ్డి, సోమాశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి

స్కూల్స్ కాంప్లెక్స్ ఏర్పాటులో మార్పులు చేయాలి

నెల్లూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో తీసుకువస్తున్న సంస్కరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణను తాము స్వాగతిస్తూ స్వల్ప మార్పులు చేపట్టాలని రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్(ఆర్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు షేక్.ఖాజా రహంతుల్లా కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్, అర్బన్ ఎంఈవోలకు శుక్రవారం ఆయన వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చీఫ్ విజిలెన్స్ అధికారిని కలిసిన ఎస్ఈ

నెల్లూరు(జడ్పీ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏపీఎస్‌పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి జనార్దన్ నాయుడిని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని విజిలెన్స్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

కళాశాలలో దాడులపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఆర్ న్యాయ కళాశాలలో మహిళలను వేధింపులకు గురిచేయడంతో పాటు దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయ కళాశాలలోని ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి మహిళా విద్యార్థినిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. దీనిపై ప్రిన్సిపాల్ సదరు విద్యార్థిని మందలించినా కూడా వేధింపులకు పాల్పడుతుండడంతో మహిళా విద్యార్థిని కుటుంబ సభ్యులు శుక్రవారం సీనియర్ విద్యార్థికి దేహశుద్ధి చేశారన్నారు. న్యాయ కళాశాలలో ఇలాంటి ఘటనలు దురదృష్టకరమని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవా లని కోరారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త!

పొదలకూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి పండుగ సందర్భాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం నూతన సంవత్సర శుభాకాంక్షలు పేరుతో దోచుకునేందుకు సిద్ధమవుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నౌరోజ్ అన్నారు. శుక్రవారం పొదలకూరు మండలంలోని గురువాయపాలెం గ్రామంలో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ చంద్రశేఖర్, బ్యాంకు ఖాతాదారులు, పొదుపు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంధమహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పెద్దదర్గా ఖాజాపీర్ బందానవాజ్ గంధ మహోత్సవం చిన్నబజార్ మెయిన్‌రోడ్డులో ఖాజా పీర్ దార్గాలో శనివారం రాత్రి 10గంటలకు జరుగుతుందని దర్గా పీఠాధిపతి కేఎస్ బాబాసాహెబ్ బాందా నవాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

కోవూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈమేళాకు 41 మంది నిరుద్యోగులు హాజరవగా వారిలో 17మంది ఉపాధి అవకాశాలు పొందారని ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, టీసీఎల్, రెలియన్స్ రిటైల్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరై ఉద్యోగుల్ని ఎంపిక చేసుకున్నారు. ఈ జాబ్ మేళాను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ డీఎస్‌డీఓ అబ్దుల్ ఖయ్యూమ్ పర్యవేక్షించారు.

విద్యుత్‌చార్జీల పెంచిన పాపం వైసీపీదే..

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా అనేకమార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేదోళ్లకు అన్యాయం చేసి ఆ పాపం కూటమి ప్రభుత్వం నెట్టేందుకు ప్రయత్రం చేస్తున్నారని ప్రజలు ఈ విషయం తెలుసుకోలేనంత అమాయకులు కాదని కూటమి నాయకులు ఎంవీ. శేషయ్య, బత్తల హరికృష్ణ, కాసా శ్రీనివాసులు, చప్పిడి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రైవేటు కంపెనీలతో లోపాయికారీ ఒప్పందంతో రూ.9వేల కోట్లు అవినీతి చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి నదిలో ఇసుక, చెరువులో గ్రావెల్ మాఫియా చేసి ఏ ముఖంపెట్టుకుని బుచ్చిలో నిరసన చేపట్టావని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమానికే పెద్దపీట వేసి అభివృద్ధి పను లు చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఎమ్మెల్యేగా ప్రజలు పట్టంగట్టారన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపి కొంతసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో శివరామకృష్ణారెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పెన్నాడెల్టా చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామానాయుడు, హరనాద్, మల్లికార్జున, కమలాకర్‌రెడ్డి, అనిష్‌రెడ్డి పాల్గొన్నారు.

స్మార్టు స్ట్రీట్ బజార్ల ఏర్పాట్లు పూర్తి కావాలి : కమిషనర్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే నెల్లూరును ప్రయోగాత్మకంగా తీసుకుని చేపట్టబోతున్న స్మార్టు స్ట్రీట్ బజార్ల ఏర్పాట్లు వేగం చేయాలని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్ఎంసీలోని తన చాంబరులో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికే రోల్ మోడల్‌గా ఉండాలని చెప్పారు. వివిధ విభాగాల అధికారులకు కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఎక్కడ నిర్లక్ష్యం కనపడకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు స్మార్టు స్ట్రీట్ బజార్లకు వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. దీంతో పాటు నగరంలోని ప్రతి స్తంభానికి లైటు ఉండాలని చెప్పారు. కూడళ్ల వద్ద అవసరాన్నిబట్టీ కాంతి పెంచేందుకు లైట్లు మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


బీజేపీ మండలాధ్యక్షుడిగా కైలాసం శ్రీనివాసులురెడ్డి

ఇందుకూరుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తూరులో శుక్రవారం భారతీయ జనతాపార్టీ మండల సమావేశం ఉపాధ్యక్షుడు నెల్లూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి బ్రహ్మానందరెడ్డి, వెంపులూరు భాస్కర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం విజయకుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు పాల్గొని పార్టీ అధ్యక్షుడిగా కైలాసం శ్రీనివాసులురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, సురేంద్‌రెడ్డి, మారుబోయిన శ్రీనివాసులు, దువ్వూరు శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.


శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రాపూరు సీఐగా ఎన్ సత్యనారాయణ

రాపూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాపూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన సీఐకి రాపూరు ఎస్ఐ వెంకటరాజేష్, పోలీసు సిబ్బంది స్వాగతం తెలిపి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరించిన సీఐ ఎన్.సత్యనారాయణ

ఇష్టంతో చదివాలి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి మార్కులు సాధిస్తారని ఉర్దూ డీఐ షేక్ ఖాజా మొహిద్దీన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఖాజానగర్‌లోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థినిల సామర్థ్యాలు, వర్క్‌బుక్‌లను పరిశీలించారు. పలు సబ్జక్టులపై ప్రశ్నలు వేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట హెచ్ఎం సన్నానయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాజుపాళెం దశ..దిశ మారనుంది

కొడవలూరు, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో నార్తురాజుపాళెం దశ-దిశ మారనుందని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందిపాటి ప్రవీణకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గ్రామంలోని 20 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో ప్రధాన కూడలి కావడంతో ఆసుపత్రి, పార్కు, పలు సిమెంటు రోడ్ల నిర్మాణ ప్రతిపాదనల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం- ఊటుకూరు రోడ్డు విస్తరణతో నార్తురాజుపాళెం కూడలికి మరింత శోభ చేకూరనుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాటూరు రమేష్, బాబి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

ఇందుకూరుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగదేవిపేటలో శుక్రవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర కళాశాల అధ్యాపకురాలు విశైలజ మాట్లాడారు. అరటి సాగుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. వరి పంట రైతులు జీవన ఎరువులు వాడుకొని రసాయన ఎరువుల మోతాదు 25 శాతం తగ్గించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినిలు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శైలజ, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జన్ని రమణయ్య

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్సు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నెల్లూరు రూరల్‌కు చెందిన జన్ని రమణయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

రైతులకు సకాలంలో యూరియా అందించండి

వెంకటాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు యూరియా సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు కోరారు. వెంకటాచలంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ సహకార సంఘాలు, రైతు సేవా సంఘాలకు వచ్చిన యూరియాను వెంటనే బయోమెట్రిక్ ద్వారా రైతులకు సరఫరా చేయాలన్నారు.

పోషకాహారం పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొండాయపాళెంలో ఉన్న అబైండింగ్ హోప్ చర్చిలో శుక్రవారం అబైండింగ్ హోప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 మంది చిన్నారులకు పాదర్ నిర్మల్‌కుమార్ శుక్రవారం పోషకాహారం పంపిణీ చేశారు. నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ కన్నన్, డాక్టర్ పెట్ల జాషువా డేవిడ్‌లివింగ్‌స్టన్, జయప్రకాష్, ఏం.విలియం, ఎం.జోలిన్, క్రాంతికుమార్, మరియమ్మ, పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది రక్తదానం

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ డైరెక్టర్ మురళీ మోహన్ జన్మదినం సందర్భంగా శుక్రవారం రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రిలో అగ్నిమాపక సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం కేన్సర్ రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఎదుట నిరసన

నెల్లూరు(క్రైం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ శుక్రవారం నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఎదుట బాధితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మంద కామాక్షి మాట్లాడుతూ కావేరీ నగర్‌లో నివాసం ఉంటున్న వైష్ణవి, రాజేష్ దంపతుల ఇంట్లో పనిమనిషిగా చేస్తున్నానని, ఈ నెల 21వ తేది సాయంత్రం ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు వచ్చి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశిస్తుండగా ప్రశ్నించినందుకు నాపై దాడి చేశారన్నారు. నన్ను కులం పేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. కేసు విత్‌డ్రా చేసుకోమని బెదిరింపు ఫోన్‌లు వస్తున్నాయని, న్యాయం చేయాలని కోరారు.


సెక్రటేరియట్ ఇంజనీర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్ల సంఘం 2025 నూతన డైరీ, క్యాలెండర్‌ను పంచాయతీరాజ్ ఎస్ఈ పి.అశోక్‌కుమార్ శుక్రవారం పీఆర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఇంజనీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.బాబురావు, పీఆర్ డిప్లమో ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఎస్‌కే ఖాదర్ మస్తాన్, పి.సుమన పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వెంకటాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకర్లవారిపాళెం రైల్వే గేటు సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం సీఐ సుబ్బారావు తన సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1260 నగదును స్వాధీనం చేసుకున్నారు.

మోటివేషనల్ స్పీకింగ్‌లో వంశీకి ప్రథమ స్థానం



నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన ఏపీ, తెలంగాణా రాష్ట్రాల నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన జిమ్ వంశీ మోటివేషనల్ స్పీకింగ్‌లో ప్రథమస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంప నాగేశ్వర రావు, అధ్యక్షుడు శ్రీనివాస్ సోను, సినీ నటుడు ప్రదీప్ ఆయనకు ప్రశంసాపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల మోటివేషన్ స్పీకర్స్ పాల్గొన్నారు.

గోదాదేవికి విశేష పూజలు

రాపూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం శుక్రవారం సందర్భంగా పెంచలకోన క్షేత్రంలో గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం క్షేత్రోత్సవం నిర్వహించినట్లు ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

మాట తప్పడం చంద్రబాబుకు అలవాటే : కాకాణి


ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి కాకాణి

వెంకటాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు, హామీలు, చెప్పిన మాటలు తప్పడం చంద్రబాబుకు అలవాటేనని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వెంకటాచలంలో శుక్రవారం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా కసుమూరు కూడలి నుండి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు వైసీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడీ రాముకి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెరిగాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం జనవరి నుంచి రూ.15,486 కోట్ల రుపాయల భారాన్ని ప్రజల మీద పెట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రజలకు ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాన్ని అటకెక్కించారని విమర్శించారు.

పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి : ప్రసన్న



ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ముంబాయి జాతీయ రహదారి మీదుగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు నల్ల బ్యాడ్జీలు, కండువాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యుత్ ఏడీఈ సీహెచ్. సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు టంగుటూరు మల్లారెడ్డి, కౌన్సిలర్ షాహుల్, వీరి చలపతిరావు, గొల్లపల్లి విజయకుమార్, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ చేపట్టిన ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చార్జీల పెంపుపై నోరు విప్పలేదు. ర్యాలీపై మాట్లాడాలని మీడియా కోరినా మావాళ్లు మాట్లాడారు చాలంటూ సమాధానం చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న అన్ని మండలాల పార్టీ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ధన్యవాదాలు చెప్పి ముగించారు.





2024 సంక్షేమంలో చీకటి వెలుగులు

'సంక్షేమ ప్రభుత్వం' అని తనకు తానే ఐదేళ్లు బాకా కొట్టుకుని ప్రచారం చేసుకున్న జగన్ ప్రభుత్వం 2024 ప్రథమార్ధంలో జిల్లా ప్రజలకు చేసిన మేళ్లు ఏమిటి? ద్వితీయార్ధంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేస్తున్నవేమిటి? ప్రజల ఆకాంక్షలకూ, ఆచరణకూ ఉన్న తేడాలను రెండు విభిన్న ప్రభుత్వాలను గద్దెమీద చూసిన 2024 సంవత్సరం పట్టి చూపుతోంది. ఆ కథాకమామిషు ఇలా ఉంది..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


జగనన్న జమానాలో..

అమ్మఒడికి ఎగనామం

అధికారంలోకి వచ్చాక వరుసగా నాలుగేళ్లు అమ్మఒడి అంటూ హడావుడి చేసిన వైసీపీ 2024లో మాత్రం అమ్మలకు ఎగనామం పెట్టింది. జిల్లాలో. లబ్ధిదారులైన 1.70 లక్షల మంది తల్లులకు మొండి చేయి చూపింది. అర్హులైన తల్లులు ఏకంగా రూ. 250 కోట్లకు పైగా నష్టపోయారు.

వాహనమిత్రకు స్వస్తి

వాహనమిత్ర పథకం కింద ఆటోలు, ట్యాక్సీలు నడిపే యజమానులకు ఏటా ఇచ్చే రూ. 10 వేలు కూడా ఈ ఏడాది జగన్ ప్రభుత్వం ఎగ్గొట్టింది. 12 వేల మంది లబ్ధిదారులకు 2024లో నిరాశే మిగిలింది. 40 వేల మంది అర్హత కలిగిన విద్యార్థులకు సుమారు రూ. 90 కోట్ల బకాయిలు పెండింగు పడ్డాయి. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కూడా రెండు త్రైమాసికాల నిధులు పెండింగులో వున్నాయి.



విద్యార్థులకూ రూ. 90కోట్లు ఎగ్గొట్టారు

జగనన్న విద్యాదీవెన పేరిట విద్యార్థులకు ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ పథకంలోనూ కోత పెట్టారు. 2024లో చివరి మూడు త్రైమాసికాలూ నగదు జమ చేయలేదు. 40 వేల మంది అర్హత కలిగిన విద్యార్థులకు రూ. 90 కోట్ల బకాయిలు పెండింగు పడ్డాయి. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కూడా రెండు త్రైమాసికాల నిధులు పెండింగులోనే వున్నాయి.



చేయూత, ఆసరా అందాయి

జిల్లాలో 1,12,436 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు చేయూత పథకం నాలుగవ విడత కింద గత వైసీపీ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ ఏడాది మార్చి 7న రూ. 210.82 కోట్లు పంపిణీ చేసింది. అలాగే ఆసరా పథకం నాలుగవ విడత కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి 26,409 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,51,818 మంది సభ్యులకు ఈ ఏడాది జనవరి 23న రూ. 232.48 కోట్లు పంపిణీ చేసింది.



కూటమి పాలనలో..

పెన్షన్ల పెంపుతో కొత్త చరిత్ర

అవ్వాతాతలకు దేశంలోనే అత్యధిక మొత్తం పింఛను ఇస్తూ తాను మేలు చేశానంటూ జగన్ గొప్పలు చెప్పుకునేవాడు. నిజానికి ఆయన అధికారంలోకి వచ్చాక విడతల వారీగా ఐదేళ్లకు పెంచింది కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే. చంద్రబాబు అధికారంలోకి వచ్చీ రాగానే ఒకేసారి వెయ్యి పెంచారు. మొత్తం 20 కేటగిరీలకు పెన్షన్ మొత్తాలు పెంచగా అందులో 11 కేటగిరీలకు రూ. వెయ్యి చొప్పున, మరో రెండు కేటగిరీలకు రూ. 3 వేలు చొప్పున, రెండు కేటగిరీలకు రూ. 10 వేలు వంతున, ఇంకో ఐదు కేటగిరీలకు రూ. 5 వేలు వంతున పెన్షన్ మొత్తాలను పెంచింది.



ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు

ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం, మాజీ ఉద్యోగులు పెన్షన్ల కోసం రోజుల తరబడి ఎదురుచూసే పరిస్థితి జగన్ ప్రభుత్వంలో ఉండేది. కూటమి ప్రభుత్వం ఈ నాన్పుడు ధోరణికి స్వస్తి చెప్పింది. ఇప్పుడు ఒకటో తేదీనే జిల్లాలోని 31,732 మంది ప్రభుత్వ రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయి. 17,501 మంది రిటైర్డు ఉద్యోగుల కుటుంబాలూ ధీమాగా పెన్షన్లు అందుకుంటున్నాయి.



- పల్లె పారిశుధ్యంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ప్రస్తుత విడతలో 358 సీసీ డ్రెయిన్లను రూ.27.26 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన మధ్యాహ్నభోజనం ఇంటర్ విద్యార్థులకు మళ్లీ అందిచాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలోని 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 5759 మంది విద్యార్థులకు మేలు జరగనుంది.



ఉచిత సిలిండర్లతో హ్యాపీ

జిల్లాలో 4.92 లక్షల వంట గ్యాస్ వినియోగదారులుండగా అందులో 4.53 లక్షల మందికి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందించే కార్యక్రమం మొదలైంది. 3.11 లక్షల మంది మొదటి ఉచిత సిలిండర్ బుక్ చేసుకున్నారు. వీరిలో 3.09 లక్షల మందికి సిలిండర్లు అందాయి. వారిలో 2.99 లక్షల మంది ఖాతాల్లో సబ్సిడీ నగదు జమ అయింది. ఈ విధంగా ఈ ఏడాది రూ. 24.84 కోట్లు లబ్ధి వీరికి కలిగింది.



పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

జగన్ అధికారంలోకి వచ్చీ రాగానే కక్షగట్టినట్టుగా పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు మూసేయించారు. కూటమి ప్రభుత్వం వీటిలో కొన్నింటిని ఈ ఏడాది అక్టోబరు నుంచీ తిరిగి తెరిపించింది. జిల్లాలో ఇప్పటికే పది క్యాంటీన్లు నడుస్తుండగా మరో రెండు త్వరలో ప్రారంభం కానున్నాయి. వీటి వల్ల భవన నిర్మాణ కూలీలు, పేద విద్యార్థులు, ఆస్పత్రులకు వస్తున్న రోగుల సహాయకుల ఆకలి తీరుతోంది.



అమలు కాని హామీలు

గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలలో కొన్ని ఈ ఏడాదిలో ఆచరణకు నోచుకోలేదు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ. 1500 ఆర్థిక సాయం, తల్లికి వందనం వంటివి ఇంకా అమలు కాలేదు. దీనివల్ల జిల్లాలో ఇంచుమించు 8 లక్షల మందికి పైగా మహిళలు ఈ పథకాల లబ్ధిని ఆరు నెలలుగా అందుకోలేదు.

పాడి రైతుకు బాసట

పేదరైతు కుటుంబాల ఉపాధిగా ఉన్న పాడి మీద కూడా జగన్ ప్రభుత్వం పగబట్టింది. కనీస ప్రోత్సాహకాలు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాడియావులను సంరక్షించుకునేందుకు గోకులాల పేరిట షెడ్లు నిర్మించి ఇస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 1358 గోకులాలను రూ. 29.94 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది.

ఇది మీ బాదుడే కదా జగన్..!

గత ఐదేళ్లలో తొమ్మిది సార్లు కరెంటు బిల్లుల షాక్


అదనపు ఛార్జీల వడ్డనతో జనానికి వైసీపీ చుక్కలు

విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసీపీ నిరసన చేయడమా..?

.. ఇదీ జనం, కూటమి నేతల ప్రశ్న. అధికారంలో ఉన్న ఐదేళ్లూ పెంచిన కరెంటు భారాన్ని గుర్తుచేస్తున్నారు. యూనిట్ రూ.5కు దొరికే విద్యుత్‌కు బదులు రూ.8నుంచి రూ.14 వరకు కొనుగోలు చేసి ప్రజలపై జగన్ మోయలేని భారమేశారని మండిపడుతున్నారు. గత ఐదేళ్లూ కరెంటు బిల్లులు ముట్టుకుంటేనే షాక్ కొట్టేలా ఉన్నాయని వినియోగదారులను గగ్గోలు పెట్టించారు. తొమ్మిదిసార్లు ధరలు పెంచుకుంటూ పోయి సామాన్య, మధ్యతరగతి ప్రజలు కరెంట్ స్విచ్ వేయాలంటేనే భయపడిపోయే పరిస్థితికి తీసుకొచ్చారు. ఇంధన సర్దుబాటు ఛార్జీల భారం నుంచి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు గత వైసీపీ పాలకులు చుక్కలు చూపించారు.

ఇదీ వైసీపీ బాదుడు : ఎస్పీడీసీఎల్ పరిధిలోని చిత్తూరు, కడప, నెల్లూరు, కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో పెంచిన ట్రూ అప్ ఛార్జీలు మొత్తం రూ.6414 కోట్లు ఉండగా, వార్షిక ఆదాయ సర్దుబాటు ఛార్జీల రూపంలో రూ.878 కోట్లు వినియోగదారులపై భారం వేశారు.

సంవత్సరం	ట్రూఅప్ ఛార్జీలు	సర్దుబాటు ఛార్జీలు
2021-22	రూ.1392 కోట్లు	రూ.591.45 కోట్లు
2022-23	2398 కోట్లు	60.84 కోట్లు
2023-24	2624 కోట్లు	224.93 కోట్లు
మొత్తం	రూ.6414కోట్లు	రూ.876.93 కోట్లు



అందుకే ఎన్నికల ఫలితాలతో వినియోగదారులు తిరిగి వాళ్లకు షాక్ ఇచ్చారు. గతంలో ఎప్పుడో వాడిన విద్యుత్తుకు ట్రూ అప్ ఛార్జీ పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసింది. సర్దుబాటు రుసుం, సర్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు.. ఇలా పేరు ఏదైనా వినియోగదారుల పైనే ఆ భారం పడింది. విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను పూడ్చుకునేందుకు ట్రూఅప్ ఛార్జీల పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను అడ్డగోలుగా బాదేసింది. ఎప్పుడో, ఎవరో వాడిన బిల్లులకు ట్రూ అప్ ఛార్జీల పేరుతో వసూలు చేస్తోందని వినియోగదారులు మండిపడ్డారు. ఇవికాకుండా బిల్లు వచ్చిన 14 రోజుల్లోపు చెల్లింపులు జరగకపోతే సర్‌ఛార్జ్, ఇంధన ఛార్జ్, జరిమానా రూపంలో పిండేశారు. ఒక విద్యుత్ సర్వీస్‌కు రూ.100 బిల్లు వస్తే, గడువు తీరిన వారంలోపు చెల్లించకపోతే రూ.135, వారంలోపు కూడా చెల్లించకపోతే మరో రూ.50.. ఆలస్య రుసుంతో రూ.185 చెల్లించాల్సి వచ్చింది. అంటే రూ.100 బిల్లుకు ఆలస్యం కారణంగా అదనంగా రూ85లు కట్టాల్సివచ్చింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నామమాత్రంగా వైసీపీ పోరుబాట

విద్యుత్ బిల్లుల పెంపునకు నిరసనగా వైసీపీ నేతలు చేపట్టిన పోరుబాటలో పార్టీ శ్రేణులు ముఖం చాటేశారు. ఇటీవల కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన రైతుపోరుబాటలోనూ రైతుల జాడ కనిపించకుండా నవ్వులపాలయ్యారు. అదేవిధంగా శుక్రవారం జిల్లాలో పలు చోట్ల జరిగిన కరెంటు పోరుబాటలోనూ అదేపరిస్థితి కనిపించింది. ముఖ్యంగా తిరుపతి నియోజకవర్గంలో మున్సిపల్ కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు, వైసీపీ హయాంలో పెద్దఎత్తున నామినేటెడ్ పదవులు పొందినవారు నిరసనలో కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష వంటివారున్న చోట కూడా పార్టీ కేడర్ లేక పలు డివిజన్ల నుంచి తెప్పించుకున్న జనంతో నిరసన చేపట్టడం గమనార్హం. అదేవిధంగా శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం నామమాత్రంగానే సాగింది. ర్యాలీలో కూడా నిరసనకారులు పెద్దగా కనిపించలేదు. పుత్తూరులో మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ జరిగింది. ఇక్కడా స్పందన అంతంతమాత్రమే. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నాయుడుపేటలో చేపట్టిన నిరసన కార్యక్రమం రసాభాసగా మారింది. వినతిపత్రం ఇచ్చేందుకు విద్యుత్ కార్యాలయానికి చేరుకున్న వీరు ఒక్కసారిగా లోపలికి చొరబడే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో కిలివేటి వాగ్వాదానికి దిగారు. వెంకటగిరిలో నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి నిరసన ర్యాలీలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా, అటుగా వెళ్తున్న మాజీ ఏఎంసీ ఛైర్మన్, టీడీపీ నేత సీసీ నాయుడు అడ్డుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతిలో వినతిపత్రం అందజేస్తున్న భూమన తదితరులు

రెవెన్యూ సదస్సులకు 456 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 456 అర్జీలు అందాయి. ఇళ్ల స్థలాలు 63, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 14, కుల పరిశీలన 1, ఫాం 22ఏ 3, రీసర్వే 11, భూ ఆక్రమణ 1, ఆర్‌వోఆర్‌పై 254, ఇతర విషయాలకు సంబంధించి 91 అర్జీలు వచ్చాయి. అందులో 78అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారు. ఇప్పటి వరకు మొత్తం 12,762 అర్జీలు వచ్చాయి.

కులగణనపై సామాజిక తనిఖీ

- అభ్యంతరాల స్వీకరణ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల గణనపై సామాజిక తనిఖీ నిర్వహించి, ఈనెల 31వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శనగా ఉంచామని, అభ్యంతరాలు ఉంటే జనవరి 6వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని పేర్కొన్నారు. తుది జాబితాను 10వ తేదీ సంబంధిత సచివాలయాల్లో ప్రదర్శిస్తామని వెల్లడించారు.

లోన్ యాప్ ఈఎంఐ చెల్లింపులో ఆలస్యం

- బాధితురాలి ఫొటోల మార్ఫింగ్
- వాట్సప్ గ్రూపుల్లో పెడతామంటూ బెదిరింపు
- ఇద్దరు నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): లోన్ యాప్ ఈఎంఐలలో ఒక వాయిదా చెల్లించడంలో ఆలస్యమైందంటూ బాధితురాలి ఫొటోలను మార్ఫింగ్ చేసి ఆమెకు పంపారు. మిగతా వాట్సాప్ గ్రూపుల్లో పెడతామని బెదిరించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను సూళ్లూరుపేట పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను శుక్రవారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. సూళ్లూరుపేటకు చెందిన ఒక మహిళ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తన అవసరాల నిమిత్తం ఆమె ఫినేబుల్ టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్, హైదరాబాదు బ్రాంచిలో కొంత మొత్తం రుణం తీసుకున్నారు. క్రమం తప్పకుండా ఐదు వాయిదాలు చెల్లించారామె. ఆరో వాయిదా చెల్లించకపోవడంతో ఆ కంపెనీకి చెందిన రికవరీ టీం సభ్యులు వాళ్లను బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం చేశారు. ఆమె సోదరుడు, తల్లిని అసభ్యకరంగా దూషించినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు బాధిత మహిళ ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేశారు. వీటిని వాట్సాప్‌లో బాధితురాలికి, ఆమె బంధువులకు పంపారు. లోన్ డబ్బులను వెంటనే చెల్లించకుంటే బాధితురాలి ఫొటోలను ఆమె కాంటాక్టుల్లో ఉన్న వారందరికీ పంపుతామని బెదిరించారు. దీనికి భయపడిన వారు లోన్ డబ్బులు చెల్లించేశారు. అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటగిరి డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో సీఐ మురళీకృష్ణ, సూళ్ళూరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఫినేబుల్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన మల్కాజ్‌గిరి జిల్లా నేరేడుమిట్ మండలం రామకృష్ణాపురం ప్రాంతానికి చెందిన లోన్ రికవరీ టీమ్ మేనేజర్ మర్క భరత్ యాదవ్, హైదరాబాదు ఫిల్మ్‌నగర్‌కు చెందిన పుటమశెట్టి రామకృష్ణను అరెస్టు చేశారు. వీరిని విచారించగా దీని వెనుక చాలా తతంగం ఉందని, కంపెనీ యాజమాన్యంపైనా చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, వెంకటగిరి డీఎస్పీ చెంచుబాబు, సీఐ, ఎస్‌లు పాల్గొన్నారు.



వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

ఇలాంటి ఆన్‌లైన్ యాప్‌లు, సైబర్ క్రైం, లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా లేనంతవరకు ఇలానే జరుగుతాయన్నారు. ఎవరికైనా ఓటీపీ షేర్ చేయడం, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడం, మీకు పార్సిల్ వచ్చిందని చెప్పి బెదిరించడం జరుగుతుందని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

వరికి మద్దతు ధర ప్రకటన

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఖరీఫ్ పంటకు సంబంధించి 89,615 హెక్టార్లలో 5,60,093 ధాన్యం ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో వరికి మద్దతు ధర ప్రకటించినట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ, పౌరసరఫరా మార్కెటింగ్‌శాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ధాన్య సేకరణ కేంద్రాలు ప్రారంభించాలని ఏగ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,320, సాధారణ రకానికి రూ.2,300 నిర్ణయించినట్లు చెప్పారు. మద్దతు ధర కన్నా తక్కువకు రైతులు విక్రయించుకునే పరిస్థితి కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

మొదటి ఘాట్‌లో కొండకు వెలుగులు

తిరుమల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి వెళ్లే భక్తులతో తిరుపతి నగరవాసులకు ఆహ్లాదకరంగా ఉండేలా మొదటి ఘాట్‌లోని వినాయకస్వామి ఆలయం వద్ద కొండకు నూతన లైట్లను అమర్చారు. గతంలో ఇదే ప్రాంతంలో లైట్లు ఉండేవి. రాత్రి వేళల్లో లైట్ల వెలుగుల్లో కొండలు సౌందర్యవంతంగా కనిపించేవి. అయితే వైల్డ్‌లైఫ్ అభ్యంతరాలతో పాటు వివిధ కారణాలతో ఆ లైట్లను తొలగించారు. ఈక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తిరిగి ఆ లైట్లను ఏర్పాటు చేయించి, భక్తులకు, స్థానికులకు కనువిందు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో టీటీడీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు ట్రయల్‌రన్ కింద ఆరు ఫోకస్ లైట్లను అమర్చారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి దూసుకెళ్లిన కంటైనర్

- మహిళకు గాయాలు
- వరదయ్యపాళ్యంలో ఘటన

వరదయ్యపాళ్యం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళ్యం పోలీసు స్టేషన్ మలుపు వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి శుక్రవారం అర్ధరాత్రి కంటైనర్ దూసుకెళ్లింది. అంతకుముందే ఆలయం వెలుపల ముగ్గులు వేసి సామగ్రిని లోపల భద్రపరిచేందుకు గీత అనే మహిళ వెళ్లారు. ఇంతలో కంటైనర్ దూసుకు రావడంతో ఆమెకు గాయాలయ్యాయి. కంటైనర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోపు డ్రైవర్ పరారయ్యాడు. గాయపడిన గీతను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.





ఆలయంలోకి కంటైనరు దూసుకెళ్లడంతో గాయపడిన మహిళ

ఆ వీఆర్వో మా కొద్దు!

తహసీల్దార్ కార్యాలయం వద్ద మత్తేరిమిట్టవాసుల ధర్నా



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళిత రైతులు

వరదయ్యపాళెం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రికార్డులు తారుమారు చేస్తున్న వీఆర్వో తమకు వద్దంటూ మత్తేరిమిట్ట దళిత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని చిలమత్తూరు పంచాయతీ మత్తేరిమిట్టలోని సర్వే నెం.35లో సుమారు 60ఎకరాల భూమిని 1960 నుంచి తాము సాగు చేసుకుంటున్నామని చెప్పారు. రైతు శ్రీనివాసమూర్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంత భూమిని విక్రయించారన్నారు. ఈక్రమంలో శ్రీనివాసమూర్తి కుటుంబీకుల్లో ఒకరైన ప్రియ చిలమత్తూరు పంచాయతీ సమీపంలో పరిశ్రమలు నెలకొల్పిందన్నారు. ఆమెకు ఎవరో ఆశ చూపి దళిత నిరుపేదలైన తమ పేరుపై ఉన్న భూములను వీఆర్వో రమణయ్య తారుమారు చేశాడని ఆరోపించారు. 2020-24 మధ్య ఇక్కడ పనిచేశారని, సాధారణ బదిలీల్లో వేరే పంచాయతీకి మార్చారన్నారు. కానీ మళ్లీ ఇదే మండలానికి బదిలీ చేయించుకున్నాడన్నారు. అనంతరం తమ సమస్యను పరిష్కరించాలంటూ తహసీల్దారు రాజశేఖర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రాజశేఖర్ మాట్లాడుతూ... భూముల పత్రాలను అందిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌నాయుడు, భాస్కర్ రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బరాయుడునాయుడు, మహేంద్ర, నందకిషోర్, ప్రభాకర్, మనోహర, శేఖర్‌నాయుడు, రామకృష్ణ, స్వామిదాస్, వెంకటేష్, రాజగోపాల్‌నాయుడు, విశ్వనాథ్‌నాయుడు, సురేష్ తదితరులు పాల్గొనానరు.

దర్శనానికి 18 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.18 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,564

తలనీలాలు సమర్పించినవారు: 24,905

కళతప్పిన నాదనీరాజనం



తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీనివాసుడు నాదప్రియుడు. ఆలయం ముందు నాట్య, గానాలతో కళాకారులు తిరుమలేశుని నివేదించుకునే అరుదైన కార్యక్రమానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. దానికి 'నాదనీరాజనం' అనే పేరు పెట్టారు. భారతరత్నలు, పద్మభూషణులు, పద్మశ్రీలు ఎందరో ఈ వేదికమీద నుంచి కళార్చన చేశారు. టీటీడీ కూడా ఈ కళాకారులను సముచితంగా సత్కరించి స్వామి దర్శనం చేయించి గౌరవించుకునేది. జగన్ జమానాలో కళపై కత్తికట్టారు. 'నాదనీరాజనం' కార్యాక్రమాన్ని భ్రష్టుపట్టించారు. కళాకారులకు కనీసం దర్శనాలు కూడా లేకుండా చేశారు. ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం లేకుండా చేసేశారు. కూటమి ప్రభుత్వం అయినా 'నాదనీరాజనం' లోపాలను సరిదిద్ది పూర్వ వైభవం తీసుకురావాలని కళాభిమానులు కోరుకుంటున్నారు.

- జగన్ జమానాలో నీరుగార్చేశారు
- కళాకారులకు కరువైన గౌరవం
- ముఖం చాటేస్తున్న ప్రసిద్ధులు
- కళాకారుల ఎంపిక తీరుపై ఆరోపణలు
- పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని కొత్త పాలకమండలికి కళాభిమానుల వేడుకోలు

గతమెంతో ఘనం

2009 ఆగష్టు 15న తిరుమల ఆలయం ఎదురుగా ఉండే వేదికపై 'నాదనీరాజనం' ప్రదర్శనలు మొదలయ్యాయి. ఈ వేదికను ఒక దాత నిర్మించారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలు 'నాదనీరాజనం'లో జరిగేవి. శాస్త్రీయ నృత్య, సంగీతాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. భారతరత్న లత మంగేష్కర్ (గాత్రం), పద్మవిభూషణ్ లు హరిప్రసాద్ చౌరస్యా (వేణువు), పండిట్ శివకుమార్ (సితార్), మంగళంపల్లి బాలమురళికృష్ణ (గాత్రం), శివరామన్ (మదంగం), పద్మశ్రీలు రంజన గోహార్ (ఒడిస్సీ), శోభానాయుడు (భరతనాట్యం), మీనాక్షి (కూచిపూడి), విఠల్‌దాస్ (నామసంకీర్తనం), కుమారి కన్యకుమారి (వయోలిన్), ఎల్లా వెంకటేశ్వర్లు (మృదంగం) వంటి ఎందరో ప్రసిద్ధులు ఈ వేదికపై ప్రదర్శనలు ఇచ్చారు. నిజానికి 'నాదనీరాజనం' వేదికపై ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు దేశ,విదేశాల్లో ఉన్న డిమాండు సామాన్యమైనది కాదు. లక్షలకు లక్షలు చెల్లించినా కార్యక్రమానికి వారు అంగీకరించడం అంత సులువు కాదు. సాక్షాత్తూ తిరుమల స్వామి సమక్షంలో తాము పాడుతున్నామనీ, నృత్యం చేస్తున్నామనే భావనే వీరిని తిరుమలకు రప్పించేది.

ఇలా ఉండేది..

సుదూర ప్రాంతాల నుంచి ప్రదర్శన ఇచ్చేందుకు తిరుమలకు వచ్చే కళాకారులకు గతంలో ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చేవారు. ఏ టాప్‌కు రూ.35 వేలు, ఏ గ్రేడ్‌కు రూ.30 వేలు, నత్యంకు రూ.60 వేలు, నామసంకీర్తనంకు రూ.20 వేలు అందజేసేవారు. అలాగే కళాకారులందరికీ ఉచిత రవాణా, బస కల్పించేవారు. ప్రత్యేక దర్శనం ఉండేది. ప్రదర్శన అనంతరం వేదిక మీదే వీరిని సత్కరించి లడ్డూ ప్రసాదాలు అందజేసేవారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాలకు ఈవో, జేఈవోలు సైతం హాజరయ్యేవారు. కళాకారులు కూడా ఎంతో సంతృప్తి చెందేవారు.

కళావిలువలకు తిలోదకాలు

'నాదనీరాజనం' ప్రదర్శనలకు గతంలో ఒక ఎంపిక కమిటీ ఉండేది. టీటీడీ మాజీ ఈవో పీవీఆర్కే ప్రసాద్ నేతృత్వంలో.. కుమారి కన్యాకుమారి, శోభారాజ్, మల్లాది సూరిబాబు, గంగాదేవి, నేదునూరి కృష్ణమూర్తి వంటి దాదాపు 35 మంది సంగీత ప్రముఖులు ఈ కమిటీలో ఉండేవారు. వీరు కళాప్రదర్శనలు ఎంపిక చేసి ఏ రోజున ప్రదర్శన ఇవ్వాలో నిర్ణయించేవారు. 2017లో పీవీఆర్కే ప్రసాద్ మరణం తర్వాత నిపుణుల కమిటీ లేకుండా పోయింది. అయితే 2022 ఫిబ్రవరిలో సంగీత కళాశాల, వేదిక్ యూనివర్సిటీ, ఎస్వీబీసీ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కళాకారుల ఎంపిక తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. గ్రేడ్‌తో నిమిత్తం లేకుండా ఇష్టానుసారం కళాప్రదర్శనలకు అనుమతులు ఇచ్చేశారు. కళాకారుల పట్ల టీటీడీ తీరుపై అసంతృప్తి చెందిన ప్రసిద్ధులైన కళాకారులు 'నాదనీరాజనం'పై ఆసక్తి చూపలేదు. దీంతో కళాకారులకు పారితోషకాన్ని రద్దు చేసి, ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు మాత్రమే దర్శనం, వసతిని కల్పించారు. ఉచితంగా ప్రదర్శనలిచ్చేందుకు ఔత్సాహికులైన కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చునంటూ అప్పట్లో హిందూ ధర్మప్రచార పరిషిత్ ప్రకటనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చైర్మన్‌గారూ పట్టించుకోండి

శ్రీకృష్ణదేవరాయలు వంటి కళాపోషకులకు ఆరాధ్య దైవం అయిన తిరుమల శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న కళారహిత చర్యలను సరిదిద్దాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన కళాభిమానులు డా. టి.శ్రీనివాసరావు, డా. కె.జగ్గారావు టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడును అభ్యర్థిస్తూ ఒక లేఖ రాశారు. ఒకప్పటి పారితోషకాల విధానాన్నీ, గౌరవాలను తిరిగి ప్రవేశపెట్టి నాదనీరాజనంకు పూర్వపు వైభవాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ఇలా దిగజారింది..

జగన్ జమానాలో కళాప్రదర్శనలకు విలువ లేకుండా పోయింది. కళాకారులను గౌరవించడం తగ్గిపోయింది. టీటీడీకి ఆర్థికభారం అంటూ అన్నీ రద్దు చేసేశారు. 'నాదనీరాజనం'లో ప్రదర్శన ఇవ్వాలనుకున్నవారు సొంత ఖర్చుతోనే తిరుమలకు రావాలని ఆదేశించారు. కళాకారులకు ఉచిత వసతి లేదన్నారు. చివరికి స్వామి దర్శనాలు కూడా కుదరదని చెప్పేశారు. కార్యక్రమం సమయాన్ని కూడా మధ్యాహ్నం 3.10 నుంచి 4.30 గంటలకు మార్చారు. 2020 నుంచి ఏడాది పాటు ఈ విధానం కొనసాగింది. దీంతో చాలా మంది ప్రముఖ కళాకారులు రావడానికి ఇష్టపడలేదు. ఒకప్పుడు కర్ణాటక, హిందుస్థానీ సంగీత కచేరీలకూ, నామసంకీర్తనం కళాకారులకూ వేదిక అయిన 'నాదనీరాజనం' ఇప్పుడు వెలవెల పోతోంది. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, ఆంధ్రనాట్యం, మోహినియాట్టం, మణిపురి, ఒడిస్సి శాస్త్రీయ నత్యాలను ఈ వేదిక మీద నుంచి వీక్షించిన ప్రేక్షకులకు ఇప్పుడు నిరాశే మిగులుతోంది. వయోలిన్, మృదంగం, ఘటం, డోలు, వేణువు, కంజీర, మోర్సింగ్, నాదస్వరం, వీణ, శాస్సోఫోన్, తవిల్, సితార్, సరోద్ వంటి వాయిద్య విన్యాసాలను తన్మయులై వీక్షించిన వారు.. ప్రస్తుత ప్రదర్శనల తీరు చూసి పెదవి విరుస్తున్నారు.

క్రైం కార్నర్

విద్యార్థిని పట్ల అసభ్యకర ప్రవర్తన

- ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అరెస్ట్



ఉమా మహేష్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాలలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో ప్రొఫెసర్ ఉమామహేష్ శుక్రవారం అరెస్టయ్యారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. వ్యవసాయ కళాశాలలో క్రాప్ ఫిజియోలజీ విభాగంలో ఉమామహేష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన ఓ విద్యార్థిని ఫీజులు సక్రమంగా చెల్లించి తరగతులకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో ఆమె ఒక్కరే క్లాస్‌కు రావడంతో నవంబరు నెలలో పాఠం చెబుతూ.. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బయటకు చెప్పేందుకు మధనపడిన ఆమె.. చివరకు ఇప్పుడు తన తల్లిదండ్రులకు చెప్పారు. వారు శుక్రవారం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ప్రొఫెసర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

మహిళ వద్ద రూ.2.80 లక్షల అపహరణ



బాధితురాలు పల్లెమ్మ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో నగలు తాకట్టు పెట్టి తీసుకెళ్తున్న రూ.2.80 లక్షలు అపహరణకు గురైన ఘటన నాయుడుపేట పట్టణంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు వివరాలు... మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో నివాసం ఉంటున్న పల్లెమ్మ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తోంది. వ్యవసాయ పనులకు డబ్బులు అవసరం కావడంతో శుక్రవారం బ్యాంకుకు వెళ్లి నగలు తాకట్టుపెటి రూ.2.83 లక్షలు తీసుకుంది. ఇందులో రూ.3వేలు ఖర్చుల కోసం పర్సులో పెట్టుకుంది. మిగతా నగదును కర్రల సంచిలో భద్రపరుచుకుని బ్యాంక్ నుంచి బయలుదేరింది. బజారులో కిరాణా దుకాణం వద్ద ఆగి వస్తువులను కొనుగోలు చేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రూ.2.80 లక్షలు అపహరించారు. కొంతసేపటి తరువాత సంచిలో నగదు లేకపోవడాన్ని గుర్తించి లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

వైసీపీ నేత బుల్లెట్ జయశ్యామ్ అరెస్టు

- చీటింగ్ కేసులో 14రోజులు రిమాండ్

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు బుల్లెట్ జయశ్యామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చీటింగ్ కేసులో ఆయనకు 14రోజుల రిమాండ్ విధించారు. శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్ వద్ద కొందరు వైసీపీ నాయకులు పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న పనస కాలువ భూమిని గత ప్రభుత్వ హయాంలో కబ్జా చేశారు. ఆ స్థలాలను వాటాలుగా వేసుకుని అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో బుల్లెట్ జయశ్యామ్ తొట్టంబేడు మండలం శివనాథపురం రెవెన్యూ పరిధిలోని పనసకాల్వ భూమిని ఆక్రమించినట్లు బాహాటంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ యేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పనసకాలువ భూమిలో అక్రమంగా నిర్మించిన 105 కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఇందులో కేవీబీపురం మండలం రాజులకండ్రిగకు చెందిన కేశవులు అనే వ్యక్తి బుల్లెట్ జయశ్యామ్‌కు రూ.6లక్షలు నగదు చెల్లించి స్థలం కొనుగోలు చేశాడు. ఆరు నెలల క్రితం అది కాలువ భూమిగా తేలడంతో అధికారులు అక్కడ కట్టడాలను కూల్చివేశారు. దాంతో బాధితుడు కేశవులు తన నగదు రూ.6లక్షలు తిరిగి ఇవ్వాలని జయశ్యామ్‌పై ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం బాధితుడు కేశవులు తనకు కాలువ స్థలాన్ని అమ్మి బుల్లెట్ జయశ్యామ్ అనే వ్యక్తి మోసానికి పాల్పడ్డాడని గట్టిగా నిలదీస్తే రూ.లక్ష నగదు ఇచ్చాడని... ఆ తరువాత నెలలు గడుస్తున్నా మిగతా నగదుపై సమాధానం చెప్పడం లేదని తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై చీటింగ్‌కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఈ కేసులో తొట్టంబేడు పోలీసులు బుల్లెట్ జయశ్యామ్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం కోర్టుకు హాజరుపరచడంతో 14రోజుల రిమాండ్ విధించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బుల్లెట్ జయశ్యామ్ తీరుపై పెద్దఎత్తున అభియోగాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఆయన బహిరంగంగా దౌర్జన్యాలకు పాల్పడటం దుమారం రేపింది. రెండేళ్ల క్రితం పట్టణ నడిబొడ్డున ఎన్టీఆర్ కూడలిలో పాలసరఫరా సంఘం ఎన్నికల నామినేషన్ రోజున టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు కారుపై కాసిరాళ్లతో దాడి చేసి విధ్వంసానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ప్రజలందరూ చూస్తుండగానే చలపతినాయుడును కారు నుంచి బయటకులాగి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఇక పాలకమండలి సభ్యుడుగా ముక్కంటి ఆలయంలో పలువురు అధికారులపై బూతులతో రెచ్చిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

మినీ ట్రక్కును ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, ఎనిమిది మందికి గాయాలు
- గొర్రెల సంతకు వెళుతుండగా ప్రమాదం
- క్షతగాత్రులందరూ రైల్వేకోడూరువాసులే





మృతి చెందిన సోమయ్య - దెబ్బతిన్న మినీట్రక్కు

గూడూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెల సంతకు వెళ్తున్న మినీ ట్రక్కును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన గూడూరు మండలం చెన్నూరు సమీపంలో శుక్రవారం వేకువజామున 3గంటలకు జరిగింది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు... అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరువాసులు చిల్లకూరు మండలం ముత్యాలపాడు సమీపంలోని గొర్రెల సంతకు మినీట్రక్కులో శుక్రవారం రాత్రి బయలుదేరారు.వేకువజామున 3గంటల సమయంలో గూడూరు మండలం చెన్నూరు సమీపంలో గూడూరు వైపు నుంచి తిప్పవరప్పాడు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మినీట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ప్రయాణిస్తున్న అన్నమయ్య జిల్లా పిట్లావారిపల్లెకు చెందిన సోమయ్య(45) మృతిచెందాడు. నాగవరం గ్రామానికి చెందిన మణి, సుబ్రహ్మణ్యం, ఓబులపల్లెకు చెందిన చిన్నవెంకటయ్య, పాతబజారుకు చెందిన రమణయ్య, తిన్నిశెట్టిపల్లెకు చెందిన పెంచలయ్య, చిన్నరాసపల్లెకు చెందిన ఈశ్వరయ్య, పైనపల్లి గ్రామానికి చెందిన భాస్కర్, రైల్వే కోడూరుకు చెందిన సూర్యప్రకాష్ తీవ్రంగా గాయపడ్డారు. సోమయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. లారీ వేగంగా ఢీకొనడంతో మినీట్రక్కు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కొంతమంది క్షతగాత్రులు వాహనంలో ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో గాయపడిన వారిని వెలుపలికి తీశారు.

ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- 80 గ్రాముల బంగారం, కారు స్వాధీనం



అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

సత్యవేడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సత్యవేడు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం ఉదయం స్థానిక పాలశీతలీకరణ కేంద్రం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఊత్తుకోట నుంచి వస్తున్న కారు పోలీసులను చూసి దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తుండగా అప్రమత్తమై కారును చుట్టుముట్టామన్నారు. కారులో ఉన్న ఐదుగరిని అదుపులోకి తీసకున్నామన్నారు. అనంతరం కారును తనిఖీ చేయగా 80 గ్రాముల బంగారం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని విచారించగా మండలంతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతన్నట్లు తేలిందన్నారు. ఈ ముఠా సత్యవేడు మండలం శిరుణంబూదూరులో ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీ రాత్రి ఓ ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలో ఉన్న 40 గ్రాముల బంగారు చోరీ చేసిందన్నారు. అదే విధంగా దాసుకుప్పంలో ఈ ఏడాది మార్చి 20వ తేదీ మధ్యాహ్నం ఓ ఇంట్లో 40 గ్రాముల బంగారం చోరీ చేసినట్టు విచారణలో అంగీకరించారని తెలిపారు. అదే విధంగా తమిళనాడు రాష్ట్రం ఈరోడ్, రాణిపేట జిల్లాల్లో కూడా ఇటీవల తాజాగా చోరీలకు పాల్పడి కారుతో పాటు బంగారు నగలను అపహరించినట్లు తేలిందన్నారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లా సావుకుప్పానికి చెందిన వి.కన్నదాసన్(28), తిరువణ్ణామలై జిల్లా వెంగిక్కల్‌కు చెందిన జీ.శ్రీరామ్ అలియాస్ బిల్లు (19), రంజిత్‌కుమార్ (19), కాంచీపురం జిల్లా మధురమంగళానికి చెందిన డి.రవి(27), విల్లుపురం జిల్లా సెంజివట్టానికి చెందిన బాలుడు ఉన్నారు. వీరు తమిళనాడులో వివిధ కేసుల్లో జైలుశిక్ష అనుభవించి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చినట్లు తెలిసింది.



మత్స్యకార నాయకులతో సమావేశమైన ఎఫ్‌డీవో మహిజ

బకాయిలు చెల్లిస్తేనే పక్షుల పండుగకు పడవలిస్తాం

- ఎఫ్‌డీవోకు తేల్చి చెప్పిన మత్స్యకార నాయకులు -

తడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 2019 పక్షుల పండుగ సమయంలో ఏర్పాటు చేసిన పడవలకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లిస్తేనే వచ్చేనెల జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌కు పడవలను సమకూర్చుతామని మత్స్యకార నాయకులు ఎఫ్‌డీవో మహిజకు తేల్చిచెప్పారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మత్స్యకార నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా భీములవారిపాళెం పడవల రేవులో పడవ షికారు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం పడవలను సమరూర్చాలని కోరారు. మత్స్యకార నాయకులు స్పందిస్తూ ఆరేళ్లుగా తమ బకాయిల కోసం అధికారుల చుట్టూ తిరిగామని, 2020లో ధర్నా చేస్తే పోలీసులు తమపై కేసులు పెట్టి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 పక్షుల పండుగ బకాయిలు చెల్లిస్తేనే పడవలు ఇస్తామని తేల్చిచెప్పారు. ఒక రోజుకు ఒక్కొక్క పడవకు రూ.7వేల అద్దె, పడవ నడిపే ముగ్గురు వ్యక్తులకు కూలి, భోజనాల కోసం రూ.3000 చొప్పున మొత్తం రోజుకు రూ.10వేలు అవుతుందని చెప్పారు. పాత బకాయిలు చెల్లించడంతో పాటు వచ్చే నెలలో పండుగకు అడ్వాన్స్‌గా కొంత చెల్లించాలని స్పష్టం చేశారు. సమావేశంలో మత్స్యకార నాయకులు బొమ్మన పళణి, మనోహర్, సుధాకర్, ప్రకాష్, ఏకాంబరం, జయపాల్, వాసు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఐదుచోట్ల పక్షుల పండుగ

- ఏర్పాట్లను పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ

సూళ్లూరుపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వచ్చే నెల 17నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఐదుచోట్ల పక్షుల పండుగ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులతో కమిటీలను కూడా నియమించారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానం, అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, నేలపట్టు, బీవీపాలెం, శ్రీసిటీలో పక్షుల పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు పక్షుల పండుగ జరిగే జూనియర్ కళాశాల మైదానం, అట్టకానితిప్పలో ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షుల పండుగకు వచ్చే సందర్శలకు అవసరమైన వసతులు, ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో గూడూరు డీఎల్‌డీవో వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏఈ భవాని, ఏపీఎం ప్రసన్న కుమారి, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అట్టకానితిప్పలో ఏర్పాట్ల గురించి తెలుసుకొంటున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీఎల్‌డీవో వాణి తదితరులు

అర్జీలకు 45రోజుల్లో పరిష్కారం: కలెక్టర్



విన్నమాల రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు 45రోజుల్లో పరిష్కారం చూపించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని విన్నమాలలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి విన్నమాల మీదుగా అత్తలపాళెం వరకు 3.5 కిలోమీటర్లు రోడ్డు నిర్మించాలని ప్రజలు వినతిపత్రం అందజేశారని, ఈరోడ్డు నిర్మాణానికి మూడు రోజుల్లో అనుమతులను మంజూరు చేస్తామని చెప్పారు. అలాగే విన్నమాలలో శ్మశానవాటిక కోసం 50 సెంట్లు కేటాయించి, పనులను కూడా త్వరలోనే చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాయుడుపేట పట్టణం నుంచి జాతీయ రహదారి దాటి విన్నమాల, మరో నాలుగు గ్రామాలకు వెళ్లాల్సి ఉందని, ప్రమాదాలు ఎక్కువ జరుగుతుండడంతో అండర్‌బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరారు. అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి వీలులేకపోవడంతో వేరే తరహాలో బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఇన్‌చార్జి తహసీల్దారు రాజేంద్ర, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నెలవల రాజేష్, అరవపెరిమిడి చంద్రారెడ్డి, ఆమవరపు సత్యం, దార్ల రాజేంద్ర, మధురెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం, పక్కన పులిమి శ్రీనివాసులు, చెంచురామయ్య, పట్టాభిరామిరెడ్డి తదితరులు

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 8మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.14.77లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెక్కులను అందజేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు సీఎంగా, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో బాధితులకు సుమారు రూ.9కోట్లు సీఎం సహాయనిధి నుంచి అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల లోపే నియోజకవర్గ పరిధిలోని 32మంది బాధితులకు రూ.42.52లక్షల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, కరుణాకర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, వాటంబేడు శివకుమార్, దుద్దా రాఘవరెడ్డి, రవీంద్రరెడ్డి, ముప్పా చరణ్, నరసింహులు పాల్గొన్నారు.

చేడిమాలలో ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రశాంత్, పక్కన ట్రస్ట్ పౌండర్ శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి రామయ్యనాయుడు

చిల్లకూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేడిమాల గ్రామంలో శుక్రవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెంకటాచలానికి చెందిన ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యవిజ్ఞాన సంస్థ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పలువురికి డాక్టర్ ప్రశాంత్ కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ట్రస్ట్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్స చేయించి కంటి అద్దాలను పంపిణీ చేస్తామని ట్రస్ట్ ఫౌండర్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రాజనేని రామయ్య నాయుడు, అనుబ్‌బాబు, ఎంఈవో రవూఫ్, బాబు, ప్రజేంద్రరెడ్డి, సుమలత, సాయికుమార్, మహితాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

గూడూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఉత్తరం వైపు ఉన్న రైలు పట్టాలపై శుక్రవారం ఓ మృతదేహం పడివుండటాన్ని రైల్వే సిబ్బంది గుర్తించారు. రైల్వే జీఆర్ పోలీసుల వివరాల మేరకు... చిల్లకూరు మండలం తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన రమేష్(48) టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం క్రమంలో రైల్వేపట్టాలపై మృతి చెందివున్నాడు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా... ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతిచెందాడా అన్న విషయం తెలియాల్సి వుందన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి విచారణ చేస్తున్నట్లు రైల్వేజీఆర్ పోలీసులు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డబ్ల్యూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ అన్నారు. స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో మూడు నెలల పాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మహిళ చైతన్యవంతురాలు అయితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సునీత సేవాసంస్థ చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి, శిక్షకురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా కిషోర్‌గౌడ్

పెళ్లకూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా పెళ్లకూరు మండలం పునబాక గ్రామానికి చెందిన కిషోర్‌గౌడ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నుంచి నియమాక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, నూకాలమ్మ, తురక అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల రిజిస్ట్రేషన్ ప్రైవేట్‌కు అప్పగించొద్దు

సూళ్లూరుపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను ప్రైవేట్ వ్యక్తులకే అప్పగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం సూళ్లూరుపేట రవాణాశాఖ కార్యాలయం ఎదుట రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు కార్మికులు నిరసన తెలపారు. రవాణాశాఖ అధికారి అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు పద్మనాభయ్య, లక్ష్మయ్య, రాజబాబు, కరీం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

వాకాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం డీఎస్పీ రమణకుమార్ తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని క్రైమ్ రేట్, పురోగతి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మకమైన గ్రామాల్లో నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ నాగబాబు, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్

ఏరియా ఆస్పత్రికి నాలుగు నెలల్లో నూతన భవనం

కలెక్టర్ వెంకటేశ్వర్



ఏరియా ఆస్పత్రి వద్ద నూతన భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వైద్యులు

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఏరియా ఆస్పత్రి వద్ద నిర్మిస్తున్న నూతన భవనాన్ని నాలుగు నెలల్లోగా ప్రజలకు అందుబాటు లోకి తెచ్చేలా చర్యలు చేపడుతామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం ఆయన ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారా లేదా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తన దృష్టికి తీసుకురావడంతో తనిఖీ చేపట్టామన్నారు. రూ.23 కోట్లతో చేపట్టిన ఏరియా ఆస్పత్రి నూతన భవనాలు నాలుగేళ్లుగా సాగుతుండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చించి నాలుగు నెలల్లో నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారి ప్రమాదాల్లో గాయపడి ఏరియా ఆస్పత్రికి వచ్చేవారికి సత్వర సేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. మార్చురి గది సమీపంలో ప్రహరీ దెబ్బతిందని, ఆస్పత్రిలోని వ్యర్థపునీరు స్టేడియంలోకి వస్తుండడంతో వాకర్లు, క్రీడాకారులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రహరీ నిర్మిస్తే ఈ సమస్యను పరిష్కరించవచ్చునని, ఇందుకు నిధులు కేటాయించాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రహరీ నిర్మించేందుకు రూ.17లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పడంతో కలెక్టర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రవికుమార్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ ధ్యేయం



ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ ధ్యేయమని, ఇందుకోసం అలుపెరుగని పోరాటాలు సాగిస్తామని ఆ సంఘం నెల్లూరు జిల్లా మాజీ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల వసతి గృహాల్లో మౌలిక సదుపాలయాలను మెరుగుపరచాలన్నారు. ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా యశ్వంత్, బ్రహ్మేంద్ర, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, సుజిత్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మణి, మధు, కిరణ్, రాహుల్, రఫీ, శివ తదితరులు పాల్గొన్నారు.

'నాగరాజు, హర్షను ఆదుకుంటాం'



చిన్నారులకు నగదు అందజేస్తున్న ఎంపీడీవో వేణు, అధికారులు

కోట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వింత చర్మవ్యాధితో బాధపడుతున్న కోట మండలం కర్లపూడి బీసీ కాలనీకి చెందిన అన్నదమ్ములు నాగరాజు, హర్షలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంపీడీవో వేణు తెలిపారు. ఈనెల 25న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నరక యాతన' వార్తకు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ స్పందించారు. ఆయన సూచన మేరకు కర్లపూడిలో నివాసం ఉంటున్న చిన్నారులను శుక్రవారం ఎంపీడీవో వేణు, పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, అల్లాభక్షు, సచివాలయ సిబ్బంది పరామర్శించారు. వ్యాధి రావడానికి గల కారణాలను తండ్రి వెంకటసుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు. మందుల ఖర్చులకు కొంత నగదు అందజేశారు.

చిన్నారులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కర్లపూడి గ్రామానికి చెందిన చిన్నారులు నాగరాజు, హర్షకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్యచికిత్స అందించి వ్యాధిని నయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పిన సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలో నివాసం ఉంటున్న సుబ్బారావు మండలంలోని శ్రీనివాసపురానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో మోటారు సైకిల్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సులో 27 అర్జీలు

కోట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరం పంచాయతీ ఇలకూరుపాడులో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. 27 అర్జీలు వచ్చాయి. ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను మరోచోట నిర్మించండి

తడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాంబట్టులో ఏర్పాటు కానున్న నూతన సబ్‌స్టేషన్ మరోచోట నిర్మించాలని ఎస్ఎంకండ్రిగ గ్రామస్తులు తహసీల్దారు శరత్‌బాబును కోరారు. శుక్రవారం వారు తహసీల్దారు కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యను వివరించారు. ప్రస్తుతం సేకరించిన భూమి అడవి పోరంబోకు అని, గ్రామ అవసరాల కోసం దానిని వదిలిపెట్టి, మరోచోట సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తహసీల్దారు చెప్పారు.

అంగన్‌వాడీ విద్యపై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధిస్తున్న కార్పొరేట్ స్థాయి విద్యపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీడీపీవో మునికుమారి కోరారు. పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్లతో కోట సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషక విలువలతో కూడిన ఆహారంపై అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని రెండోపట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పాతసంత రోడ్డు జంక్షన్‌లో హెల్మెట్ ధారణపై ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్‌ను ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడుతామన్నారు. నిబంధనలు ఉల్లఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాహన దారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి

పెళ్లకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని నెలబల్లిలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఏవో గొడవర్తి ప్రవీణ, ఎంఈవో మించల శంకరయ్య, ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వోలు భూదనం రమేష్, మోబీనా, కల్యాణి, మండల సర్వేయర్ పూజిత, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మాడుపూరు మురళీనాయుడు, శాఖమూరి కృష్ణమ నాయుడు, కురుమేటి ఉదయ్‌కుమార్, నరేంద్ర, పసుపులేటి రవినాయుడు, కోదండరామ నాయుడు, అట్ల బాబు, మాధవరెడ్డి, చంద్రయ్య, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్, సుబ్బరామరాజు తదితరులు

గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, వేమయ్య, సుబ్బారావు తదిరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ మృతితో దేశం ఒక గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల కారణంగానే దేశ ఆర్థికవ్యవస్థ ప్రగతిపథంలో పయనించిందన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయకుమార్

తడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ తేదీలు ఖరారైనందున గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పక్కబందీగా నిర్వహించాలని ఎంపీడీవో విజయకుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. చెత్తాచెదారాలు లేకుండా చూసుకోవాలని, మురికిగుంటలు ఉన్నచోట బ్లీచింగ్ చల్లాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, శేషారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

వాకాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాళెం గ్రామానికి చెందిన మల్లాపు దేవేంద్రబాబు శుక్రవారం గూడూరు మండలం మనుబోలు వద్ద ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ బాధిత కుటుంబానికి టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూదనరెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, తీపలపూడి అన్వేష్ ద్వారా రూ. 10వేల నగదు అందజేశారు.

కరెంటు చార్జీల పెంపు పాపం జగన్‌దే: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సీసీ నాయుడు, పులికొల్లు రాజేశ్వరరావు, రావి మాస్తాన్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు

వెంకటగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పలుమార్లు కరెంటు చార్జీలు పెంచి పేదలపై పెనుభారం మోపిన పాపం మాజీ సీఎం జగన్‌దేనని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీసీ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, రావి మస్తాన్ నాయుడు, పునుగోటి విశ్వనాధ నాయుడు, కురుగొండ్ల దొరస్వామి మీడియాతో మట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు పూర్తి కాకముందే కరెంటు చార్జీలు విపరీతంగా పెంచేసిందని వైసీపీ నేతలు విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. పోరుబాట పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేతలు అవాకు చవాకులు పేలడం తగదన్నారు. అదానీతో జగన్ కుదుర్చుకొన్న చీకటి ఒప్పందాల కారణంగానే రాష్ట్రం దివాలా తీసిందన్నారు. ఇప్పుడు ఏ మోహం పెట్టుకొని జనంలోకి వస్తారని ప్రశ్నించారు. జగన్‌కు ధైర్యం ఉంటే అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని హితవు పలికారు.

విద్యుత్‌చార్జీల పెంపుతో పేదలపై పెనుభారం: వైసీపీ





గూడూరు సబ్‌స్టేషన్ ఎదుట ఎమ్మెల్సీ మేరిగ ఆధ్వర్యంలో ధర్నా - వెంకటగిరిలో రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణుల ర్యాలీ



నాయుడుపేటలో విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

గూడూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి పేదలపై పెనుభారం మోపిందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని సబ్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో పోరుబాట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అనంతరం సబ్‌స్టేషన్‌లోని విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భక్తవత్సలరెడ్డి, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, సునీల్‌రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, కాండ్ర నారాయణరెడ్డి, గురవయ్య, బాలకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. మాజీ ఎమ్మెల్యే స్వగృహం నుంచి స్కూటర్ ర్యాలీగా విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కొంతమందిని మాత్రమే కార్యాలయం లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించారు. దీంతో సంజీవయ్య, పోలీసులు మధ్య తీవ్ర వాగ్వావాదం చోటుచేసుకుంది. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే మీ సంగతి తెలిస్తానంటూ మాజీ ఎమ్మెల్యే హెచ్చరికలు జారీచేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఈఈకి వినతిపత్రం అందజేసి వెనుతిరిగారు. వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీలు ధనలక్ష్మి, పెళ్లకూరు జడ్పీటీసీ ప్రిస్కిల్లా, అనిల్‌రెడ్డి, వైసీపీ నాయకులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్ (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నేదురుమల్లి నివాసం నుంచి ర్యాలీగా వెళ్లి పాలకేంద్రం వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వెంకటేశ్వర్లు, బాలయ్య, కల్యాణి, రాజారెడ్డి, పులి ప్రసాద్‌రెడ్డి, ఆరి శంకరయ్య, శ్రీనివాసులు, సుజాత, వహిదా, ఎస్‌థానీ బాషా తదితరులు పాల్గొన్నారు.